ప్రజాశక్తి

సోమవారం 6 మార్చి 2023 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా

సమస్యల వలయంలో పిఎన్ బస్టేషన్

- రాబడిపై ఉన్న ధ్యాస... సమస్యల పరిష్కారంపై శ్రద్ధేది?
- దెబ్బతిన్న ఫ్లోరింగ్... వెలగని లైట్లు

దెబ్బతిన్న బస్‌స్టేషన్ ఫ్లోరింగ్

ప్రజాశక్తి-విజయవాడ

విజయవాడ పండిత నెహ్రూ బస్‌స్టేషన్ (పిఎన్‌బిఎస్) ప్రాంగణంలోని ఫ్లోరింగ్ దెబ్బతినడంతో ప్రయాణికులయిన వృద్ధులు, మహిళలు, పిల్లలు రాకపోకల సమయంలో తట్టుకొని పడిపోతున్నా సంబంధిత అధికారుల్లో చలనం ఉండటం లేదనే విమర్శ వినిపిస్తోంది. డిపార్చర్ బ్లాక్, టెర్మినల్ బ్లాక్ ఎదురుగా బస్సులు రాకపోకల సమయంలో పెరిగిన రద్దీతో ఫ్లోరింగ్ కుంగిపోయి దెబ్బతింది. ఎత్తు పల్లాలుగా ఉండటంతో ప్రయాణికులు హడావుడిగా వెళ్లే క్రమంలో తట్టుకొని, అదుపు తప్పి పడిపోతున్నారు. లక్షలాది మంది ప్రయాణికులు, వందలాది ఆర్టీసి సర్వీసుల రాకపోకలతో నిత్యం బస్‌స్టేషన్ ప్రాంగణం విఫరీతమైన రద్దీ పెరిగిపోతూ ఫ్లోరింగ్ దెబ్బతిని ఆర్టీసీ బస్సుల బేరింగ్‌లు దగ్గర నుంచి పలు రకాలుగా స్పేర్‌పార్ట్స్ దెబ్బతింటున్నాయని డ్రైవర్లు వాపోతున్నారు. ఆక్కడక్కడ స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా లైనింగ్‌కు కలర్స్ వేయిస్తున్న అధికారులకు దెబ్బతిన్న ఫ్లోరింగ్ బాగు చేయిద్దామనే ధ్యాస లేకపోవడం, ఒక వేళ ఉన్నా కానీ ఆచరణలో ఏళ్ల తరబడి అలాగే ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదమరిచి ఈ ఫ్లోరింగ్‌పై బస్సుల కోసం వేగంగా నడిచినా ఎక్కడ అదుపు తప్పి పడిపోతారో అన్నట్లుగా తయారయ్యింది. అంతేగాక ప్రయాణికులతో కళకళలాడాల్సిన బస్‌స్టేషన్‌లో విద్యుత్ లైటింగ్ వ్యవస్థ కూడా అధ్వాన్నంగా తయారయ్యింది. అక్కడక్కడా లైట్లు వెలగక బస్‌స్టేషన్ చీకటిమయంగా దర్శనమిస్తోంది. ఆర్టీసి సర్వీసులు ఎక్కడ పార్కింగ్ చేశారోనని చీకటిలో ప్రయాణికులు వెతుక్కోవాల్సి వస్తోంది. సంబంధిత అధికారులు బాగు చేయిస్తున్న పరిస్థితి లేదు. చీకటిలో పిక్‌పాకెట్‌గాళ్లు సునాయాసంగా జేబులు కొట్టేందుకు అనుకూలంగా ఉందని ఇక్కడ పని చేస్తున్న పలువురు ఉద్యోగులు వ్యక్తం చేస్తున్నారు. మార్చి మొదటి వారంలోనే వేసవి ఎండల తీవ్రత పెరిగిపోతూ, సుదూరు ప్రాంతం నుంచి ఎండల్లో వచ్చిన ప్రయాణికులకు, బస్సు కోసం వేచి ఉంటున్న వారికి సరైన ఫ్యాన్ల సదుపాయం లేదు. ఉన్న ఫ్యాన్లు (మిగతా 6లో)

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

కృష్ణాజిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఎం.ఫణి దూర్జటి

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అందిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఎం.ఫణి దూర్జటి తెలిపారు. ప్రత్యేకంగా ఆధార్ కార్డులను అందిస్తున్నట్లు చెప్పారు. అర్హులైన మరికొందరికి అటవీ భూముల హక్కు పత్రాలు (ఆర్‌వోఎఫ్‌ఆర్) అందివ్వనున్నట్లు వివరించారు. గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులకు రాబోయే విద్యా సంవత్సరం నుంచి పెరిగిన మెనూ ఛార్జీలు అమల్లోకి వస్తాయన్నారు. జిల్లాలో గిరిజన సంక్షేమానికి జరుగుతున్న కృషిని ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

ప్రశ్న: పునర్విభజన తర్వాత కృష్ణాజిల్లాలో గిరిజనులు సంఖ్య ఎంత ఉంది?

జవాబు: జిల్లా పునర్విభజన తర్వాత కృష్ణాజిల్లా మొత్తం జనాభా 17.35 లక్షలు. గిరిజనుల సంఖ్య 38 వేలు, మొత్తం జనాభాలో 2.19 శాతంగా ఉన్నారు.

ప్ర: గిరిజనులందిరికీ సంక్షేమ పథకాలు అందించడానికి ఏ విధమైన చర్యలు తీసుకుంటున్నారు?

జ: సంక్షేమ పథకాలకు ఆధార్ కార్డు తప్పనిసరి. గిరిజనుల్లో ఆధార్ కార్డులు లేని వారు ఉన్నారు. జిల్లావ్యాప్తంగా 400 మందిని గుర్తించాం. వారిలో 200 మందికి కార్డులు ఆన్‌లైన్ ఎన్‌రోల్‌మెంట్ చేశాం. మిగిలిన వారికి ఎన్‌రోల్‌మెంట్ జరుగుతోంది. అర్హతలను బట్టి సంబంధిత శాఖలతో మాట్లాడి సంక్షేమ పథకాలను వర్తింపచేయడానికి కృషిచేస్తున్నాం. 200 యూనిట్లు లోపు వినియోగించే గిరిజన కుటుంబాలకు ఉచితగా విద్యుత్ అందిస్తున్నాం. ఈ స్కీంలో జిల్లాలోని గిరిజనులకు రూ.2.50 కోట్లు లబ్ధి చేకూరింది. కళ్యాణమస్తు పథకం ద్వారా వివాహం చేసుకున్న ఒక గిరిజన జంటకు రూ.1 లక్ష అందించాం.

ప్ర: గిరిజనుల్లో అక్షరాస్యత పెంపుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: ఇతరులతో పోల్చుకుంటే గిరిజనుల్లో అక్షరాస్యత తక్కువుగా ఉంది. అక్షరాస్యత పెంచేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయి. ఉమ్మడి జిల్లాలో బాల, బాలికలకు విడివిడిగా 2400 సీట్లుతో గురుకుల పాఠశాలలు నిర్వహిస్తోంది. కృష్ణాజిల్లా ఉయ్యూరులోని బాలుర వసతి గృహంలో 90 మంది విద్యార్థులు చదువుతున్నారు. రాబోయే విద్యా సంవత్సరం నుంచి పెరిగిన మెనూ ఛార్జీలు అమల్లోకి వస్తాయి. 3, 4 సంవత్సరం విద్యార్థులకు రూ.1000 నుంచి రూ.1250, 5వ తరగతి నుంచి 10 వరకు రూ.1250 నుంచి రూ.1400కు మెనూ ఛార్జీలను ప్రభుత్వం పెంచింది. 3వ తరగతి నుంచి (మిగతా 6లో)

ప్రజలకు నాణ్యమైన వైద్యం

మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి

ప్రజాశక్తి-అవనిగడ్డ

రాష్ట్రంలోని ప్రజలకు నాణ్యమైన మెరుగైన కార్పొరేట్‌స్థాయిలో వైద్య సేవలు అందించటమే రాష్ట్రప్రభుత్వ లక్ష్యమని మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి అన్నారు. పవర్ ఫైనాన్స్ కంపెనీ కార్పొరేషన్ ఆర్థిక సహకారంతో రూ.5.50 కోట్లతో సమకూర్చిన అధునాతన వైద్య పరికరాలను ఆదివారం అవనిగడ్డ ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలశౌరి మాట్లాడుతూ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ సమకూర్చిన నిధులతో ఆధునిక వైద్య పరికరాలను కొనుగోలు చేశామని ఎంపీ చెప్పారు. పేద ప్రజలకు మెరుగైన వైద్య సహాయం అందాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేస్తున్న కృషి ఫలితంగానే మారుమూల ప్రాంత వైద్యశాలలకు సైతం అధునాతన పరికరాలను సమకూర్చుతున్నామన్నారు. శతాబ్దాల నుండి ఎదురుచూస్తున్న బందరు పోర్టు నిర్మాణానికి పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ సంస్థ రూ.4000 కోట్లు సమకూర్చటంతో కోర్టు నిర్మాణానికి అడ్డంకులన్నీ తొలగిపోయి పనులు ప్రారంభించనున్నట్లు ఎంపీ చెప్పారు. కార్పొరేషన్ డైరెక్టర్ మనోజ్ శర్మ, ఇడి ష కృతజ్ఞతలు తెలిపారు. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుండి రుణం సమకూర్చేందుకు ఎంపీ చేసిన ప్రయత్నాన్ని మనోజ్ శర్మ అభినందించారు. ఎమ్మెల్యే రమేష్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో వైద్య రంగాన్ని అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి ఫలితమే ఈ పరికరాలు సమకూర్చడమన్నారు. అవనిగడ్డ ఏరియా వైద్యశాలలో ఒక డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని సీఎంను కోరామన్నారు. ఆయన అంగీకరించడంతో పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. త్వరలోనే డయాలసిస్ సెంటర్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి (మిగతా 6లో)

సభలో మాట్లాడుతున్న ఎంపి బాలశౌరి

రమణీయం పార్వతీ పరిణయం

వార్త 5లో

ఆదర్శప్రాయుడు సామినేని విశ్వనాథం

- విగ్రహావిష్కరణ సభలో రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : సర్దార్ సామినేని విశ్వనాథం జగ్గయ్యపేట పట్టణానికి చేసిన అభివృద్ధి, పట్టణానికి అందించిన సేవలు, భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. జగ్గయ్యపేట మాజీ సర్పంచ్, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను తండ్రి కీర్తిశేషులు సర్దార్ సామినేని విశ్వనాథం కాంస్య విగ్రహ ప్రతిష్ట మహెూత్సవం ఆదివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఘనంగా జరిగింది. విగ్రహ ఆవిష్కరణ మహెూత్సవంలో ఎమ్మెల్సీ, మాజీ కేంద్ర మంత్రివర్యులు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ప్రభుత్వవిప్, స్థానిక శాసనసభ్యులు సామినేని ఉదయభాను, మాజీ హెూం శాఖ మంత్రి వసంత నాగేశ్వరరావు, శాసనమండలి సభ్యులు తోట త్రిమూర్తులు, నందిగామ, మైలవరం, తిరువూరు శాసనసభ్యులైన మొండితోక జగన్మోహన్ రావు, వసంత కష్ణ ప్రసాద్, కొక్కిలిగడ్డ రక్షణ నిధి, ప్రముఖ పారిశ్రామికవేత్త సామినేని రవిచంద్, యువ నాయకులు సామినేని వెంకట కష్ణ ప్రసాద్ బాబు లతో కలిసి అభిమానులు హర్షద్వనాల మధ్య సర్దార్ సామినేని విశ్వనాథం విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో జోగిరమేష్ మాట్లాడుతూ తనకు రాజకీయ భిక్ష పెట్టింది సామినేని వారి కుటుంబమేనని, జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఏ ప్రాంతం చూసినప్పటికీ సామినేని విశ్వనాథం, సామినేని ఉదయభాను చేసిన అభివద్ధి కనిపిస్తుందని తెలిపారు. జగ్గయ్యపేట అంటే విశ్వనాథం, విశ్వనాథం అంటే జగ్గయ్యపేట అనే రీతిలో జగ్గయ్యపేట అభివద్ధికి విశ్వనాథం కి విడదీయరాని అనుబంధం ఉందని అన్నారు. ఎంఎల్‌సి ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జగ్గయ్యపేట నియోజకవర్గం అభివద్ధికి సర్దార్ సామినేని విశ్వనాథం చేసిన కషి ఎనలేనిదని అన్నారు. జగ్గయ్యపేట ప్రాంతంలో 24 ఏళ్లగా ప్రజా ప్రతినిధిగా ఉంటూ ప్రజల కోసం అహర్నిశలు వారి సమస్యల పరిష్కారం కోసం చేసిన కషి భవిష్యత్ తరాలకు ఆదర్శమని అన్నారు, త్రాగునీరు, విద్యుత్తు తో పాటు పేద విద్యార్థుల చదువు కోసం ఆయన చేసిన కషి ఈనాటికీ ప్రతి ఒక్కరూ చెప్పుకోవడం స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్దార్ సామినేని విశ్వనాథం కుమార్తెలు శ్రీమతి ఉదయ్ శ్రీ, శ్రీమతి జయ శ్రీ, శ్రీమతి చాముండేశ్వరి, ప్రభుత్వవిప్ శాసనసభ్యులు సామినేని ఉదయభాను సతీమణి సామినేని విమలభాను, ప్రముఖ పారిశ్రామికవేత్త సామినేని రవిచంద్ సతీమణి శ్రీమతి రమా, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, హఫీజున్నిసా, పట్టణ మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ ముత్తినేని విజయ శేఖర్, పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ల లారీలో మంటలు

- తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : సిఎన్ జి గ్యాస్ సిలిండర్ల లారీలో మంటలు అంటుకొని లారీ క్యాబిన్ పూర్తిగా దగ్ధమైన సంఘటన మండలంలోని అనుమంచిపల్లి గ్రామ సమీపంలో బోర్డర్ హెూటల్ వద్ద శనివారం రాత్రి జరిగింది. సేకరించిన సమాచారం మేరకు కాకినాడ నుండి హైదరాబాద్ వెళుతున్న సి ఎన్ జి గ్యాస్ సిలిండర్ లారీ అనుమంచిపల్లి గ్రామ సమీపంలో బోర్డర్ హెూటల్ వద్ద ఒక్కసారిగా లారీ క్యాబిన్ లో మంటలు చెలరేగాయి. దీంతో లారీ డ్రైవర్, క్లీనర్ లారీలో నుంచి దూకి తప్పించుకున్నారు. లారీ క్యాబిన్ మొత్తం మంటల్లో చిక్కుకొని పోవడంతో లారీలో ఉన్నటువంటి సి ఎన్ జి గ్యాస్ సిలిండర్లు పేలిపోతాయేమోనని, ప్రమాదం జరుగుతుందేమోనని స్థానిక ప్రజలు, వాహనాల డ్రైవర్లు, ప్రయాణికులు పరుగులు తీశారు. దీంతో విజయవాడ హైదరాబాద్ రోడ్డుపై వాహనాలతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ప్రమాదానికి కారణం లారీలో వంట చేస్తుండగా ప్రమాదం జరిగి ఉంటుందని తెలుస్తుంది. విషయాన్ని చిల్లకల్లు పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి తెలియజేయడంతో వారు హుటాహుటిన సంఘటన స్థలం వద్దకు వచ్చి లారీలో మంటలను అధికష్టంపై ఆర్పేశారు. చిల్లకల్లు ఎస్సై దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది క్రేన్ సహాయంతో లారీని రోడ్డు పక్కకు పెట్టించడంతో ట్రాఫిక్ క్రమబద్ధకరించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-కంచికచర్ల : మండలంలోని కీసర బ్రిడ్జి పైనుండి మునేటిలోకి దూకి ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. మండలంలోని పెండ్యాల గ్రామానికి చెందిన గడ్డం తిరుపతిరావు అతని స్నేహితులతో ఘర్షణపడి బ్రిడ్జి పైనుండి మునేటిలోకి దూకినట్లు స్థానికులు తెలిపారు. మునేటిలో నీటి ప్రవాహం లేకపోవడంతో ఇసుకలో పడిన తిరుపతిరావు తీవ్రంగా గాయపడ్డాడు. తిరుపతి రావు మునేటిలోకి దూకడాన్ని గమనించిన స్థానికులు అతనిని రక్షించి హైవే అంబులెన్స్ లో నందిగామ ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయవాడ తరలించినట్లు కంచికచర్ల పోలీసులు తెలిపారు.

మాజీ సైనిక సేవా పరిషత్ జనరల్ బాడీ సమావేశం

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్ : అఖిల భారతీయ పూర్వ (మాజీ) సైనిక సేవా పరిషత్ ఆంధ్రప్రదేశ్ జనరల్ బాడీ సమావేశం ఆదివారం పి.బి సిద్దార్ధ కాలేజీ ఆడిటోరియలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిలుగా మేజర్ జనరల్ బి.వి.రావు,(రిటైర్డ్) అధ్యక్షత వహించగా, కల్నల్ (జనరల్ సెక్రటరీ) జె. వాసుకి శర్మ హాజరైయ్యారు ఈ సందర్భంగా బి.వి రావు మాట్లాడతూ దేశ భద్రత కోసం మాజీ సైనికుల కషి ఇంకా ఎంతో అవసరం ఉందని కోరారు. ఈ సమావేశంలో జనరల్ బాడీ గురించీ, ఓ.అర్.ఓ.పి, పే-కమిషన్, సమస్యల పరిష్కారం గురుంచి సభ్యుల సందేహాలను నివత్తి చేశారు. మాజీ సైనికుల పెన్షన్ల సమస్య గురుంచి చర్చించారు. దీనిని ఉన్నత అధికారుల దష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా కషి చేద్దాం అన్నారు. ఈ కార్యక్రమంలో 30 సంవత్సరాలు సేవలు అందించిన వాసుకి శర్మ కు, బి.వి, రావులను ఘనంగా సన్మానం చేశారు. సభ్యులు కె.కె,నర సింహా రావు, జి.శివ నాగేశ్వర రావు, బి.బి, రాజు, ఓ . ప్రభాకర్ రావు, కె. రామకష్ణ రావు, కె. ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డూలాస్ అకాడమీ వార్షికోత్సవాలు

బహుమతులు అందజేస్తున్న ఎంఎల్‌సి అరుణ్ కుమార్

ప్రజాశక్తి-నందిగామ : నందిగామ పట్టణంలో డూలాస్ అకాడమీ వార్షికోత్సవ వేడుకలు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులు, విద్యా సంస్థలపై ఉందని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అరుణ్ కుమార్ అందజేశారు. డూలాస్ ట్రస్ట్ తరపున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పగిడిపల్లి దేవసహాయం-పగిడిపల్లి మణి ఆనంద్ లను ప్రత్యేకంగా అభినందించారు. డూలాస్ విద్యాసంస్థల్లో నిరుపేదలకు- అనాధ బాలలకు ఉచితంగా విద్యా బోధన అందించడం హర్షణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఎంఈఓ బాలాజీ నాయక్, వివేకానంద పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుంచం లక్ష్మీ నారాయణ, దళిత చైతన్య వేదిక అధ్యక్షులు కన్నెగంటి సజ్జనరావు, డూలాస్ ట్రస్ట్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

'ముదిరాజ్‌ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి'

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : స్థానక బాలికల పాఠశాల సమీపంలో మిట్టగూడెం ముదిరాజ్ సంఘం కమ్యూనిటీ హాల్ నందు ఆదివారం ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ క్యాలెండర్ ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను, ఆయన తనయులు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ముదిరాజుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని అన్నారు. మత్స్యకార భరోసా ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్క కుటుంబానికి పదివేల రూపాయలను వారికి అందిస్తున్నారని తెలిపారు. జగ్గయ్యపేటలో ముదిరాజ్ భవన్ ఏర్పాటుకు తమ వంతు సహాయ సహకారాలు అందించామని ఈ సందర్భంగా తెలియజేశారు. ముదిరాజ్ భవనం చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి కూడా తాను సహకారం అందిస్తానని వారికి హామీ ఇచ్చారు. ఇంక ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు చప్పిడి కృష్ణమోహన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో ఎక్కడా లేని విధంగా ఒక్క జగ్గయ్యపేటలోనే ప్రభుత్వవిప్ శాసన సభ్యులు సహకారంతో ఈ భవనాన్ని ఏర్పాటు చేసుకోవడం సంతోషదాయకమన్నారు. ఆయన చేసిన ఈ సహకారం చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ దువ్వల రమాదేవి, రామకృష్ణ, మాజీ కౌన్సిలర్ నీలం నరసింహారావు, ముదిరాజ్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షులు తేనె కృష్ణ, సులోచన, ముదిరాజు, ఉద్యోగుల విభాగం రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీనివాస్, ముదిరాజ్ సంఘం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు కొంగితాల లక్ష్మీపతి, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కాటుబోయిన గురునాథం, ఉపాధ్యక్షులు గరికంటి చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి అర్వపల్లి నరసింహస్వామి,సహాయ కార్యదర్శి కాటు బోయిన కోటయ్య, కోశాధికారి గుగ్గిళ్ళ నాగేంద్రం పాల్గొన్నారు.

నేడు 'స్పందన' కార్యక్రమం

ప్రజాశక్తి-విజయవాడ : ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10: 30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ యస్.ఢిల్లీ రావు ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల ఉన్నతాధికారులు ఉదయం 10 గంటలకు స్పందన కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు .డివిజన్, మండల స్థాయిలోనూ స్పందన కార్యక్రమం నిర్వహిస్తారని, ప్రజలు తమ అర్జీలను మండల, డివిజన్ స్థాయిలోనూ సమర్పించవచ్చునని కలెక్టర్ తెలిపారు.

సబ్ కలెక్టర్ కార్యాలయంలో...

నగరంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుండి స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సబ్ కలెక్టర్ అదితి సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్ పరిధిలోని ప్రజలు తమ వినతులను స్పందన లో అందించి పరిష్కరించుకోవాలని కోరారు.

శ్రీ వాహినిలో నీట్ పీజీ మెడిసిన్ ప్రవేశపరీక్ష

ప్రజాశక్తి -తిరువూరు : స్థానిక శ్రీవాహిని ఇంజనీరింగ్ కళాశాల లో టాటా కన్సల్టెన్సీ సర్వీస్(టిసిఎస్), కేంద్ర ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ పోస్ట్ గ్రాడ్యుయేట్ (నీట్ పీజీ 2023) మెడిసిన్ ప్రవేశపరీక్ష జరిగింది. నిష్ణాతులైన వైద్యులను పరిశీలకులుగా నియమించి ప్రవేశ పరీక్షను నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.నాగేంద్రబాబు తెలిపారు ఈపరీక్షకు 133 మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు.

గురుకుల ప్రవేశ మోడల్ పరీక్ష

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశానికి జరిగే పరీక్షకు "ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ ఆఫ్ ఫ్రీ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ సెంటర్" మోడల్ పరీక్ష ఆదివారం జరిగింది. రెవ జి విశ్వనాథ్ పేపర్ ను విడుదల చేశారు. వైస్ ఎంపీపీ చాట్ల రాబర్ట్, ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ గౌరవ సలహాదారుడు ప్రత్తిపాటి పాల్ఇమ్మానుయేలు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు చాట్ల విజయకుమార్, యం సుధ, చౌటపల్లి ప్రశాంతి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ మహాలక్ష్మి జన్మ నక్షత్ర మహోత్సవాలు

ప్రజాశక్తి-నందిగామ : నందిగామ మండలం మాగల్లు శ్రీ వైకుంఠ నారాయణ క్షేత్రంలో ఉన్న 108 అడుగుల శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శ్రీ మహాలక్ష్మి జన్మ నక్షత్ర మహెూత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఎ ఎస్ ఎం సి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మూడో రోజు ఆదివారం అర్చక స్వాములు అంగర రాంబాబు ఆచార్యుల ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ దేశ శ్రేయస్సు కాంక్షిస్తూ ప్రత్యంగి రా మాత మహా యాగం, వైఖానస సాంప్రదాయ పద్ధతులు శ్రీ రాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత నరసింహ దివ్య కళ్యాణం వేదమంత్రోచ్చారణ నడుమ కన్నుల పండుగ జరిగింది. సాయంత్రం శ్రీ రాజ్యలక్ష్మి ఉంజల సేవ, సామూహిక కుంకుమార్చనలు పలు గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

26 నుంచి గన్నవరం- షిర్డీ విమాన సర్వీసు

● ప్రయాణ వేళలు.. టికెట్ ధరలు ఖరారు

ప్రజాశక్తి-గన్నవరం : విజయవాడ(గన్నవరం) విమానాశ్రయం నుంచి షిర్డీకి నేరుగా విమాన సర్వీసు అందుబాటులోకి రానుంది. షెడ్యూల్..టికెట్ ధరలు అధికారులు ఖరారు చేసారు. షిర్డీకి వెళ్లే సాయి భక్తులకు గుడ్ న్యూస్ అంటున్నారు.. విజయవాడ నుంచి షిర్డీకి నేరుగా విమాన సర్వీసు అందుబాటులోకి రానుంది. ఇప్పటి వరకు ఇక్కడి నుంచి షిర్డీ వెళ్లాలంటే రైలు..రోడ్డు మార్గాల ద్వారా వెళ్లాల్సి వచ్చేది. రైళ్ల సంఖ్య ఏపీ నుంచి తక్కువగానే ఉన్నాయి. విమాన సర్వీసు శంషాబాద్ నుంచి షిర్డీకి కొనసాగుతోంది. ఏపీలోని ఏ విమానాశ్రయం నుంచి షిర్డీకి సర్వీసు లేదు. ఇప్పుడు షిర్డీకి ఏపీ నుంచి వెళ్లే భక్తుల సంఖ్య పెరుగుతుండటంతో గన్నవరం నుంచి నేరుగా షిర్డీకి విమానం నడపాలని ఇండిగో సంస్థ నిర్ణయించింది. ఇందుకు సంబంధించి సర్వీసు ప్రారంభ ముహూర్తంతో పాటుగా షెడ్యూల్.. టికెట్ ధరలను ప్రకటించింది.

విజయవాడ నుంచి నేరుగా షిర్డీకి మార్చి 26 నుంచి ప్రతీ రోజు విమాన సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు ఇండిగో విమాన సంస్థ ప్రకటన చేసింది. ఈ మేరకుఅధికారికంగా షెడ్యూల్ వెల్లడించింది. ప్రతీ రోజు గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఏటీఆర్ 72-600 విమానం షిర్డీకి ఖరారు చేసారు.72 మంది ప్రయాణీకుల సామర్థ్యంతో ఈ విమానం గన్నవరం - షిర్డీ- గన్నవరం మధ్య సర్వీసుకు నిర్ణయించారు. ప్రతీ రోజు మధ్నాహ్నం 12.25 గంటలకు గన్నవరం లో

బయల్దేరే ఈ విమానం 3 గంటలకు షిర్డీకి చేరుకుంటుంది. అదే విధంగా ప్రతీ రోజు షిర్డిలో మధ్యాహ్నం 2.20 గంటలకు బయల్దేరి సాయంత్రం 4.35 గంటలకు గన్నవరం చేరుకుంటుందని సంస్థ ప్రకటించింది. 2 గంటల 50 నిమిషాల్లోనే షిర్డీకి చేరుకోవచ్చని విమానయాన అధికారులు వెల్లడించారు.

ప్రయాణ వేళలు.. టికెట్ ధరలు ఖరారు..

గన్నవరం నుంచి షిర్డీకి ప్రారంభ టికెట్ ధర రూ 4,246గా నిర్ణయించారు. అదే విధంగా షిర్డీ నుంచి గన్నవరం కు టికెట్ ధర రూ 4,639గా నిర్ధారించారు. ఏపీ జిల్లాల నుంచి ఇప్పటి వరకు షిర్డీ వెళ్లాంటే రైలు ప్రయాణం అందుబాటులో ఉంది. లేదంటే రోడ్డు మార్గం ద్వారా షిర్డీకి చేరుకోవాల్సి వచ్చేంది. షిర్డీలో విమానాశ్రయం అందుబాటులోకి వచ్చిన తరువాత శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి విమాన సర్వీసులు ప్రారంభించారు. శంషాబాద్ నుంచి షిర్డీకి విమాన ప్రయాణం గంటా 34 నిమిషాలు గా ఉంది. టికెట్ ధర రూ 4,086 గా కొనసాగుతోంది. ఇక, ఇప్పుడు నేరుగా గన్నవరం నుంచి షిర్డీకి విమాన సర్వీసులు అందుబాటులోకి రావటం ద్వారా ఆక్యుపెన్సీ రేషియా కూడా బాగానే ఉంటుందని అంచనా వేస్తున్నారు.

ప్రయాణీకుల ఆదరణపై అంచనాలు

ప్రస్తుతం సికింద్రాబాద్ నుంచి షిర్డీకి నిత్యం సాయంత్రం బయల్దేరే మన్మాడ్ ఎక్స్ ప్రెస్‌కు భారీ డిమాండ్ ఉంది. నిత్యం వెయిటింగ్ లిస్టు కనిపిస్తోంది. శంషాబాద్ నుంచి షిర్డీకి వెళ్లే విమాన సర్వీసుల్లోనూ ఏపీ నుంచి వెళ్లే వారి సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. అదే విధంగా ఏపీ జిల్లాల నుంచి షిర్డీకి వెళ్లే భక్తుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో తొలుత 72 మంది ప్రయాణీకుల సామర్థ్యం ఉన్న సర్వీసును ప్రారంభిస్తున్నారు. ప్రయాణీకుల నుంచి వచ్చే ఆదరణ పరిశీలించిన తరువాత అవసరమైన విధంగా నిర్ణయాలు తీసుకుంటామని విమానయాన అధికారులు చెబుతున్నారు. దీంతో..షిర్డీ వెళ్లాలనుకొనే భక్తులకు ఈ విమాన సౌకర్యం ప్రయోజనకరంగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అదేవిధంగా ప్రముఖ యాత్రికా స్థలాలకు కూడా వెళ్లేందుకు విమాన సర్వీసులు అందుబాటులోకి తీసుకువస్తే బాగుంటుందని వివిధ విమాన సంస్థలు ఆలోచన చేసి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నాయి.గన్నవరం విమానాశ్రయం అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన తర్వాత భవిష్యత్తులో ఇంటర్నేషనల్ విమానాలు నేరుగా ఇక్కడకు రావడానికి సమయం దగ్గర పడుతుంది. న్యూ ఇంటర్నేషనల్ విమానాశ్రయ టర్మినల్ పనులు పూర్తవగానే గన్నవరం విమానాశ్రయ భౌతిక స్వరూపమే మారిపోతుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

వెంకటరమణ కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నం మండలం తపశిపూడి గ్రామంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్త గోవాడ వెంకటరమణకు చెందిన ఇల్లు ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూటై ,ఇంట్లోని వస్తువులు బట్టలు, సామానులు అన్ని కాలిపోయి కట్టుబట్టలతో మిగిలారు. ఆదివారం మాజీ మంత్రి, పొలిట్ బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర వారి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పి పార్టీ తరపున అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. మంగినపూడి పంచాయతీ పార్టీ ప్రెసిడెంట్ శ్రీపతి నాంచారయ్య, పాతపాటి నవీన్, మెండు భానుమూర్తి, సిరివెళ్ల సాంబయ్య, గోల్లేరు పోతురాజు, రాఘవేంద్ర పార్టీ పెద్దలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కళ్యాణ వేడుకలు ప్రారంభం

ప్రజాశక్తి - మొవ్వ : శ్రీ గంగా బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న 260వ కల్యాణోత్సవాలలో భాగంగా ఆదివారం సువాసినిలు పసుపు దంచి కళ్యాణ వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు ముత్తైదువులను ఆహ్వానిం చారు. దేవాలయంలో జగజ్యోతి కార్యక్ర మాన్ని భాగవతుల సాంబశివరావు-రాజ్యలక్ష్మి(హైదరాబాద్) దంపతుల కుమారుడు ధనుంజయ మణిరాఘవ సాయి కష్ణ శ్రీనివాస్, సుధాత్మ దంపతులు నిర్వహించారు ఎదుర్కోలు వేడుకలను పురోహితులు జోశ్యుల శ్రీ హనుమత్ కష్ణ ప్రసాద్ (విజయవాడ.), విశ్రాంత ఉపాధ్యాయులు పసుమర్తి నారాయ ణమూర్తి, పసుమర్తి మురళీకష్ణ (కూచిపూడి)లు నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆద్యంతం చలోక్తుల నడుమ భక్తిభావంతో కొనసాగింది. ఈ కార్యక్రమానికి కూచిపూడి పెదపూడి గ్రామాల తో పాటు రెండు తెలుగు రాష్ట్రాలలోని స్థిరపడిన గ్రామస్తులు హాజరైయ్యారు.

మెకానిక్‌ల సంక్షేమానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : ఇతర కార్మికుల వలె మెకానిక్ ల సంక్షేమం కోసం రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర మెకానిక్ సంఘం నాయకులు కృష్ణా జిల్లా సంఘ కార్యదర్శి కొల్లా వెంకట సుబ్బారావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం మచిలీపట్నం టూ వీలర్స్ మెకానిక్స్ సంక్షేమ సంఘం ఐదవ వార్షికోత్సవం మచిలీపట్నం లోని అన్నం రాఘవయ్య కళ్యాణ మండపంలో సంఘం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా రవాణా శాఖ అధికారి టి సీతాపతి రావు, రాష్ట్ర మెకానిక్స్ సంఘ లీగల్ అడ్వైజర్ లంకిశెట్టి బాలాజీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ అధికారి టి.సీతాపతిరావు మాట్లాడుతూ మారుతున్న చట్టాల పట్ల వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. రవాణా శాఖ కార్యాలయానికి రాకుండానే కేవలం 1300 రూపాయలతో లెర్నింగ్ డ్రైవింగ్ లైసెన్స్, పర్మనెంట్ డ్రైవింగ్ లైసెన్స్ ను పొందవచ్చని ఆయన తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వాహన పరివాహన యాప్ ను డౌన్లోడ్ చేసుకుని అందులో డ్రైవింగ్ లైసెన్స్ లు, ఇన్సూరెన్స్, వాహన రిజిస్ట్రేషన్ నమోదు చేసుకోవచ్చని ఆయన తెలియజేశారు. సంఘ రాష్ట్ర లీగల్ అడ్వైజర్ న్యాయవాది

లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటుకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు పలకాలని అన్నారు. మచిలీపట్నంలో కార్మికుల కోసం కాలనీ ఏర్పాటు చేసి, అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని, వర్క్ షాప్ ఆధునికరణ కోసం ప్రభుత్వపరంగా ఐదు లక్షల రూపాయలు ప్రభుత్వ రుణాలు మంజూరు చేయాలని బాలాజీ అన్నారు. ఈ కార్యక్రమంలో కష్ణాజిల్లా కార్యదర్శి కొల్లా వెంకట సుబ్బారావు, చల్లపల్లి, అవినిగడ్డ, బంటుమిల్లి సంఘ అధ్యక్షులు రాజా, ఖాన్, రామారావు, రుస్తుం, మచిలీపట్నం సంఘ కార్యదర్శి దాసరి శివ నాగేంద్రం కార్యవర్గ సభ్యులు రమణ, నాని తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గత 15 సంవత్సరాలుగా మెకానిక్ ల సంక్షేమం కోసం కషి చేస్తున్న కొల్లా వెంకట సుబ్బారావును గజమాలతో మెకానిక్ లు సన్మానించారు.

అరుణాచలం యాత్ర బస్సు సర్వీసులు ప్రారంభం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం నుండి అరుణాచలం యాత్రకు కు రెండు బస్సులను ఆదివారం డిపో మేనేజర్ శివాజీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సూపర్లగ్జరీ బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ఈ బస్సులులో ఒకటి వీరవల్లి దగ్గర, రంగన్నగూడెం గ్రామం నుండి అలాగే రెండవబస్సు గన్నవరం నుండి కంకిపాడు మీదుగా భక్తులను ఎక్కించుకుని బయలుదేరి వెళ్ళినట్లు చెప్పారు.ఈ బస్సులు 6వ తేదీ సోమవారం ఉదయం శ్రీకాళహస్తి, మధ్యాహ్నం కాణిపాకం, సాయంత్రం శ్రీపురం లోని గోల్డెన్ టెంపుల్ దర్శించుకుని రాత్రికి అరుణాచలం చేరుననీ, ఈ 7వ తేదీ మంగళవారం అరుణాచలంలో గిరి ప్రదక్షిణ, అరుణాచలేశ్వరుని దర్శనం చేసుకొని. సాయంత్రం బయలుదేరి 8వ తేదీ బుధవారం ఉదయం గన్నవరం చేరతాయాన్నారు. ప్రతినెలా పౌర్ణమికి ముందు రోజు గన్నవరం డిపో నుండి అరుణాచలంకు సూపర్ లగ్జరీ బస్సులు నడపనున్నట్లు తెలిపారు. ఏదైనా గ్రామం నుండి 35 మంది ఈ భక్తులు వెళ్ళదలచిన యెడల, వారిని ఆ గ్రామం నుండి ఎక్కించుకుని వెళ్ళి తిరిగి వచ్చిన తర్వాత వారి గ్రామంలో దించుతామని చెప్పారు.

మహిళా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : స్థానిక మహతి లలిత కళా వేదికపై సంస్కృతిక సంస్థ భావ తరంగిణి అధ్వర్యంలో ఈ నెల 7,8 తేదీలలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించ నున్నట్లు ప్రముఖ సాహితీవేత్త భవిష్య ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజులపాటు సాయంత్రం 6 గంటల నుంచి కార్యక్ర మాలు ప్రారంభమౌతాయని చెప్పారు. 7 వ తేది సాయంత్రం హాస్య నాటిక చంటోడి పెళ్ళి అనంతరం సభా కార్యక్ర మాలు నిర్వహి స్తారన్నారు. 8 వ తేది అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల మహిళలకు ఉత్తమ పురస్కారాలు, కవి సమ్మేళనం, గజల్స్ గానం, పద్యపఠనం ఉంటుందన్నారు. పురస్కార సభా కార్యక్రమాలకు సభాధ్యక్షులుగా గుత్తి కొండ సుబ్బారావు, ప్రత్యేక ఆహ్వానితులుగా బందరు ఆర్టీసి డిపో మేనేజర్ టి పెద్ది రాజు పాల్గొంటారని తెలిపారు.

చినఓగిరాల పిహెచ్‌సిలో వైద్య పరికరాలు ప్రారంభం

ప్రజాశక్తి-ఉయ్యూరు : గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలం దించవలసిన అవ సరం ఎంతైనా ఉందని న్యూఢిల్లీ లోని కేంద్రప్రభుత్వ రంగ సంస్థ పవర్ ఫైనాన్స్ కార్పోరేషన్ లిమిటెడ్ (పీఎఫ్సీ) డైరెక్టర్ మనోజ్ శర్మ అన్నారు. కార్పోరేట్ సామా జిక బాధ్యతగా పీఎఫ్సీ నిధులు రూ. 12.6 లక్షలతో చిన ఓగిరాల ప్రాధమిక ఆరోగ్యకేంద్రంలో ఏర్పాటుచేసిన మౌలిక సదు పాయాలు, అత్యాదునిక వైద్యపరికరాలను ఎగ్జిగ్యూటివ్ డైరెక్టర్ ఆలీషా, మచిలీపట్నం ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే కేపీ సారథితో కలసి ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. గ్రామీణ ప్రాం తాల్లో ఆధునిక వసతులతోకూడిన వైద్యసేవలకు సామాజిక బాధ్యతగా నిధులు కేటాయించామన్నారు. మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో రూ. 5.07 కోట్ల పీఎఫ్సీ నిధులతో మూడు సీహెచ్సీలు 21 పీహెచ్సీల్లో మౌలిక వసతులు, ఆధునిక వైద్యపరికరాలు ఏర్పాటు చేస్తున్నామని ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. డీఎమ్ అండ్ హెచ్ ఓ గీతాబాయి, ఎంపీపీ చీలికల్పన, సర్పంచ్ యెనిగళ్ల శిరీషా, సిద్ధార్థ అకాడమీ కార య దర్శి పాలడుగు లక్ష్మణరావు, వైసీపీ నాయకురాలు పాలడుగు శివజ్యోతి తదితరలు పాల్గొన్నారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చినఓగిరాల ఎస్సీ కాలనీలో రూ. 30 లక్షల నిధులతో కమ్యూనిటీహాల్ నిర్మాణానికి మనోజ్ శర్మ, అలీ షా, ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే కేసీ సారథి శంకుస్థాపన చేశారు. ఎంపి నిధులు రూ. 20లక్షలు, ఎమ్మెల్యే నిధులు రూ. 10లక్షలతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హా ల్ కాలనీ వాసులకు ఎంతో ఉపయోగ కరంగా ఉంటుందని బాలశౌరి అన్నారు..

కొండాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శనం చేసుకున్నారు. కృష్ణా,ఎన్టీఆర్ జిల్లాల నుంచి 12 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని అమ్మవారికి పాల పొంగళ్ళు సమర్పించి వారి మొక్కుబడులను తీర్చుకున్నారు. భక్తులకు ఏ విధమైన అసౌకర్యాలు కలగకుండా దర్శనం చేసుకునేందుకు ఆలయ అధికారులు, ధర్మకర్తల మండల చైర్మన్ ఎస్‌వివి కృష్ణమూర్తి తగు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

నవధాన్యాల సాగుతో భూమి సారవంతం

ప్రజాశక్తి-ఉయ్యూరు : నవధాన్యాలు సాగు చేయడం వల్ల భూమి సారవంతం అవుతుందని సేంద్రీయ కర్బనం జీవ వైవిధ్యం పెరుగుతుందని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పార్థసారథి తెలిపారు. రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉయ్యూరు మండలంలోని ఎగినపాడు గ్రామంలో నవధాన్యాల సాగుపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. నవధాన్యాల సాగు నుంచి ఆదాయంతో పాటు ఖరీఫ్ సీజన్ కాలానికి నేలలో అధిక పోషకాలు లభిస్తాయని తెలిపారు. 'నవధాన్యాలు సాగు చేద్దాం పుడమి తల్లిని కాపాడుకుందాం' 'నవ ధాన్యాలు వేయండి భూసారం పెంచండి' అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. రైతు అధికార సంస్థ ప్రతినిధులు, వాలం టీర్లు పి నిర్మల, పూర్ణ పాల్గొన్నారు.

గ్యాస్ ధరలు తగ్గించాలని సిపిఎం నిరసనలు

ప్రజాశక్తి-అజిత్‌సింగ్‌నగర్ : పెంచిన వంట గ్యాస్ ధరలు ఉపసంహరించాలని సిపిఎం ఆధ్వర్యంలో 62, 63 డివిజన్‌లోని రెడ్డిగారి కూరగాయలకొట్టు సెంటర్లో నిరసన ఆదివారం నిర్వహించారు. అనంతరం 63వ డివిజన్లో గ్యాస్, కరెంటు, చెత్త పన్ను, ఆస్తి పన్ను రద్దు చేయాలని పాదయాత్ర నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సి.హెచ్ బాబురావు పాల్గొని మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పెట్రోలు, డీజిల్ నిత్యవసర సరుకులు పెంచుకుంటూపోతూ ప్రజలపై అనేక భారాలు వేస్తోందన్నారు. రాష్ట్రంలో ఉన్న అధికార పార్టీ వైసిపి ప్రభుత్వం. బిజెపి ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ ప్రజల కష్టాలు పట్టించుకో పోగా అనేక రూపాలలో చెత్త పన్ను, ఇంటి పన్నులు, కరెంటు చార్జీలు పెంచి ప్రజలను ఇబ్బందిపెడుతుందన్నారు. ఇప్పటికైనా అన్ని రాజకీయ పార్టీలు కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి భూపతి రమణ రావు, కార్యదర్శివర్గ సభ్యులు కె. దుర్గారావు, నగర నాయకులు చింతల శ్రీనివాస్, నాయకులు యం. రామాంజనేయులు, పి సాంబి రెడ్డి, కూరపాటి నాగరాజు, జెల్లా నాగరాజు, రఫీ, యు. శివ లింగేశ్వరరావు, లింగాల నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్ : పెంచిన గ్యాస్ ధరలు, కరెంట్ చార్జీలు తగ్గించాలని కోరుతూ మొగలరాజపురం సీపీఎం ఆఫీస్ వద్ద సీపీఎం కమిటీ ఆధ్వర్యలో ఆదివారం పెద్ద ఎత్తున ధర్నా జరిగినది. ఈ ధర్నా నుద్దేశించి రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ మోడీ నాయకత్వంలో ఉన్న బీజేపీ ప్రభుత్వము అధికారంలోకి వచ్చిన తరువాత 400 రూపాయల నుండి 1200 రూపాయలకు వంట గ్యాస్ ధర పెంచి పేదప్రజలు తిరిగి కట్టెలతో వంటచేసుకునే పరిస్థితిని కల్పించారన్నారు అలాగే వినాశకరమైన విద్యుత్ చట్టము తెచ్చి ఇప్పటికే 6600 కోట్లు ఉన్న విద్యుత్ చార్జీలకు తోడు సర్దుబాటు పేరుతో మరో 3000 కోట్లు ఆంధ్రప్రదేశ్ ప్రజలపై భారం జగన్మోహనరెడ్డి ప్రభుత్వము వేసి నడ్డివిరుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశ్శారు మోడీ, జగన్ ప్రభుత్వాలను ఇంటికి సాగనంపితే తప్పితే ప్రజలకు ధరాభారాలు తగ్గవని హెచ్చరించారు. ఈ కార్యక్రమములో సీపీఎం జిల్లా కమిటీసభ్యులు పుప్పాల కృష్ణ, తూర్పు నగర కమిటీ సభ్యులు మురహరిరావు, దావులూరి శ్రీనివాసరావు గుంటూరు వెంకటేశ్వరరావు, లంకవలస ధర్మారావు, శేషుకుమారి, జయలక్ష్మి, మంగమ్మ, నిమ్మల విజయలక్ష్మి, బెవర శ్రీనివాసరావు, వెన్నెల ప్రసాదరావు, కుందేటి చిన్నా, కాలేష, అప్పన్న, వెంకటనాయుడు, విశ్వనాధం, దావులూరి కోటేశ్వరరావు, వావివలస వెంకట్రావు, కూరదుర్గ, దొంకాడ పద్మ, సంధ్య, చంద్ర, చెన్నమ్మ, రామబ్రహ్మం, పాపారావుగారు, కనకారావు పాల్గొన్నారు

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

ప్రజాశక్తి-తిరువూరు : 75 ఏళ్ల నిండిన మిత్రులు ఒకరిని చూసి ఇంకొకరు చెమర్చిన కళ్ళతో సం తోషాలు, సంబరాలు, ఆనందాలు, కరచాలనాలు, ఆలింగనాలతో పులకించి పోయి ఎంతో సందడి చేశారు. ఈమిత్రులంతా తిరువూరు జిల్లాపరిషత్ ఉ న్నత పాఠశాలలో 1965లో ఎస్-ఎస్‌ఎల్‌సి వరకు చదివారు. 2014లో ఒక సారి తిరువూరులో భారీయెత్తున వీరి రీ-యూనియన్ జరిగింది. ఆదివారం ఆత్మీయ సమ్మేళనం తిరువూరు దగ్గ రలోని ముత్తగూడెంలోని వెల్లంకి మా మిడితోటలో తీపిజ్ఞాపకాలతో మరొక సారి కలుసుకున్నారు. మొత్తం 45 మంది ఉన్న తమ బ్యాచ్ లో 13 మం ది మిత్రులు పరమపదించారు . తమను వీడిపోయిన ఆమిత్రులకు స్నేహి తులు ఘనంగా నివాళులు అర్పించారు. 58 సంవత్సరాల తమ స్నేహాను బంధానికి గుర్తుగా ఈకలయికను అపూర్వంగా జరుపుకున్నారు. చాలా మంది మిత్రులు యుఎస్ఎ, హైదరా బాద్, చెన్నై నుండి వచ్చి తమ చిన్ననా టి పాత జ్ఞాపకాలను, తమ అను బం ధాన్ని గుర్తుకు తెచ్చుకొని రోజంతా సంతోషంగా గడిపి, సాయంత్రం బరువె క్కిన గుండెలతో ఒకరికొకరు వీడు కోలు చెప్పుకున్నారు, మళ్ళీ ఎప్పుడు కలుస్తామో అనుకుంటూ తమ తమ ప్రాంతాలకు వెళ్లారు.

'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-వీరులపాడు : వీరులపాడు కార్మిక సంఘం కార్యాలయంలో సిఐటియు మండల కార్యదర్శి ఎస్కే లాల్ అహమ్మద్ అధ్యక్షతన ప్రజా సంఘాల సదస్సు ఆదివారం జరిగింది. సదస్సులో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం 65శాతం ప్రజలు ఆధారపడిన వ్యవయసాయ రంగాన్ని కార్పొరేట్ ఫరం చేసేందుకు మూడు నల్ల చట్టాలు, విద్యుత్ బిల్లు తెచ్చిందన్నారు. బి.జె.పి అధికారం లోకి వచ్చిన తర్వాత ప్రజా సంపదనంతా పెట్టుబడిదారులు, కార్పొరేట్లుకు దోచి పెడుతుందన్నారు. వీటికి నిరసనగా ఏప్రిల్ 5వ తేదీన జరిగే చలో ఢిల్లీ నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ మాట్లాడుతూ సాగర్ జలాలు ఏప్రిల్ 15 వరకు అందించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, రుణాలు అందించాలని, కల్తీ విత్తనాలు పురుగు మందులను అరికట్టాలన్నారు. అలాగే చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని త్వరగా పూర్తిచేసి రైతులకు సాగు నీరు అందించాలన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పట్టణ ప్రాంతాలకు వర్తింప చేయాలని, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల నిత్యవసర సరుకులు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వట్టికొండ కొండ పార్థసారథి, వట్టి కొండ రమేష్, పల్లెకంటి బాబు, కౌలురైతుల సంఘం నాయకులు చాట్ల రవి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ప్రభాకర్ , ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు చంద్ర గోవర్ధన్ సంస్మరణ సభ

ప్రజాశక్తి -నందిగామ : అడవిరావులపాడు పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు, సిపిఎం అభిమాని చంద్ర గోవర్ధన్ సంస్మరణ సభ సోమవారం నందిగామ పట్టణ శివారు ఆర్ఎస్ కళ్యాణ మండపం నందు నిర్వహిస్తున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. చంద్ర గోవర్ధన్ నందిగామ మండలం అడవిరావులపాడు గ్రామ పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు గా పని చేశారు. ఆయన సొసైటీ అధ్యక్షులు గా బాధ్యతలు చేపట్టే నాటికే నష్టాలు, కుంభకోణంలో కూరుకుపోయిన అడవిరావులపాడు పిఎసిఎస్ ను గోవర్ధన్ తన మీద వేసుకుని లాభాలబాటలో పయనింప చేశారు. గోవర్ధన్ సోదరుడు చంద్ర లక్ష్మీ నారాయణ కమ్మవారిపాలెం గ్రామ సిపిఎం సర్పంచ్ గా పని చేసిన సమయం లో గోవర్ధన్ సిపిఎం జెండా పట్టుకుని ప్రజా సమస్యల పరిష్కారానికి కషి చేశారు. కమ్మవారిపాలెం-రాఘవాపురం గ్రామ పెద్ద గా ఉంటూ అనేక సమస్యలు పరిష్కారానికి కషి చేశారు. అందరిని కామ్రేడ్ అంటూ మర్యాద పూర్వకంగా గౌరవించేవారు.

వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-గంపలగూడెం : కొలిచేవారికి కొంగుబంగారం నెమలి శ్రీ వేణుగోపాలస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమైయ్యాయి. ఆలయ పురోహితులు తిరునగరి గోపాలచార్యులు పర్యవేక్షణలో నిత్య పూజలు, అలంకరణలు జరిగాయి.. శ్రీమాన్ పరేసరం రంగనాథ చార్యులు పర్యవేక్షణలో సకల జన నైనానందకరముగా జరిగాయి. ఆదివారం అంకురార్పణతో మొదలైన ఈ కార్యక్రమాల్లో ముఖ్య ఘట్టంగా వేణుగోపాలుని పెండ్లి కుమారుగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కావూరి శశిరేఖ , సహాయ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాద్, ఉత్సవ కమిటీ పెద్దలు భక్తులు పాల్గొన్నారు

వేణుగోపాలుని పెండ్లి కుమారుగా అలంకరించిన దృశ్యం

శ్రీనిధిలో ఘనంగా వీడ్కోలు వేడుక

ప్రజాజాక్తి -తిరువూరు : తిరువూరు శ్రీనిధి టెక్నో స్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుక శనివారం రాత్రి ఘనంగా నిర్వ హించారు. దీనికి ముఖ్యఅతిథిగా ని మ్రా కాలేజి డైరెక్టర్ డాక్టర్ టి.నారాయణమూర్తి పాల్గొని విద్యార్థులను ఉద్దే శించి మాట్లాడుతూ జీవితంలో ఒక ఆశయాన్ని ఏర్పరచుకుని దానికోసం అహర్నిశల శ్రమిస్తే మంచి ఫలితాలు వ స్తాయన్నారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో హెూరెత్తించారు. ఈకా ర్యక్రమంలో శ్రీనిధి స్కూల్ చైర్మన్ పోట్రు నాగేశ్వరావు, కరస్పాండెంట్ ముత్యాల కిషోర్ బాబు, డైరెక్టర్లు, ప్రిన్సిపాల్ ఆర్.వెంకటనారాయణ, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

హక్కులు కాపాడుకుందాం

- శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ ఎ. కమల

మాట్లాడుతున్న ఎ.కమల

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలు మండలంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు పి .సుజాత అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సదస్సు, సిఐటియు మండల ఆఫీసు వద్ద జరిగింది. ఈ సదస్సుకి ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ ఎ. కమల మాట్లాడుతూ, ప్రభుత్వ విధానాల వలన మహిళలు నేటికీ అణిచివేతకు, హింసకు, గురవుతూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు ఓటు హక్కు కావాలని, లింగ వివక్షత పోవాలని,సమాన వేతనం ఇవ్వాలని, పని గంటలు అమలు చేయాలని, తదితర సమస్యల పరిష్కారం కోసం క్లారా జట్కిన్ నాయకత్వంలో ఆనాడు మహిళలు పెద్ద ఎత్తున, మహిళల యొక్క హక్కుల కోసం పోరాడారని, అందుకోసం ప్రాణ త్యాగాలు చేసి ఉరికంబాల కెక్కి జైలులో ఉన్నారని, ఆ త్యాగాల ఫలితమే మహిళలకు ప్రత్యేక హక్కులు సాధించి పెట్టిన ప్రత్యేక దీక్షాధినమే, అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఆమె గుర్తు చేశారు. కానీ నేటి ప్రభుత్వాలు వాటిని కూడా ఈవెంట్ గా మార్చి, అదేదో మహిళలకు పండగ లాగా పూలదండలతో పన్నీర్లతో చాలు వాళ్ళు కప్పి, గిఫ్ట్ ఇచ్చి మహిళలను పొగుడుతూ కొనసాగే కార్యక్రమంగా జరుపుతున్నారని ఆమె విమర్శించారు. మహిళల హక్కులను అమలు చేయకుండా, మహిళా చట్టాలను తమ చుట్టాలుగా మార్చుకుని, నేరస్తులకు కొమ్ముకాస్తూ, అండగా ఉంటున్నారని విమర్శించారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కావాలని రాజ్యసభలో బిల్ అయినప్పటికీ, లోక్ సభలో అది ఆమోదానికి నోచుకో లేదని అన్నారు. ఈ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా అన్ని రంగాల్లో ఉన్న మహిళలు, పెద్ద ఎత్తున ఐక్యంగా పోరాడాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు వి.గురవయ్య, రైతు సంఘం నాయకులు వై.రామారావు, మహిళా సంఘం నాయకులు టి.సుధా అంకుల్, ఆశ వర్కర్లు, మధ్యాన భోజనం కార్మికులు పాల్గొన్నారు.

రమణీయం పార్వతీ పరిణయం

సమ్మోహనం కూచిపూడి యక్షగానం

ప్రజాశక్తి -మొవ్వ

కూచిపూడి నాట్యోత్సవాలు జనరంజకంగా కొనసాగుతున్నాయి. కళారత్న డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్ నిర్వహణలో నాల్గోరోజు ఉత్సవాల్లో ప్రదర్శనాంశాలు వీక్షకులను ఆనంద డోలికల్లో

నాట్లోత్సవాల్లో పాల్గొన్న కళాకారులు

ముంచెత్తాయి. శ్రీ సత్య సుందర రామశాస్త్రి శిష్య బృందం ప్రదర్శించిన గణేష్ కౌతం, పుష్పాంజలి,జణుతా శబ్దం, ఇట్టి ముద్దులాడే బాలుడు..ఆకట్టుకున్నాయి. గుడివాడకు చెందిన చిరంజీవి అడుసుమిల్లి శ్రీ చైతన్య జయము జయము ..నృత్య ప్రదర్శన అలరించింది. శ్రీదేవి భవాని వేదాంతం వారి శిష్యులు సాయి ప్రణవి, రుచిత శ్రీత్రిభువన, చందు శ్రీ, దివిజ అభినయించిన సంగీత సామ్రాజ్య సంచారిణి, బాలార్కకోటి ప్రతి మానవాక్రాం , వినరో భాగ్యం విష్ణు కథ...ప్రదర్శనాంశాలు తన్మయత్వంతో ఓలలాడించాయి. కుమారి శర్వాణి (విజయవాడ) నమశ్శివాయతే నమో భవాయ ...శ్రుతి సమన్విత ప్రదర్శించిన భామాకలాపం ప్రవేశ దరువు ..మైమరపింపచేశాయి. పార్వతీ పరిణయం కూచిపూడి యక్షగానం కమనీయం కడురమణీయం అనేట్లు సాగింది. కీర్తిశేషులు దండిభట్ల వెంకట శాస్త్రి రచించిన ఈ కూచిపూడి యక్షగానంలో శివుడుగాశ్రీ వేదాంతం సిద్ధేంద్ర వరప్రసాద్, పార్వతిగా సత్యానందిని, రతీ మన్మథులుగా రమ్య సాహితీ (భావనమన్మథుడు), బృంగేశ్వరుడుగా వేదాంతం శ్రీనివాస వాగ్దేవి వరప్రసాద్,బ్రహ్మ, చండీశ్వరుడుగా లక్కరాజు వెంకటరమణ, నందీశ్వరుడుగా కావూరి వంశీ పవన్, చెలి కత్తెలుగా శ్రీవాణి,శర్వాణి, లావణ్య, స్నేహిత, గాయత్రి, లాస్య,బాలా త్రిపుర సుందరిగా శైలశ్రీ పోటాపోటీగా అభినయించి ప్రేక్షకుల హృదయాలను పరవశింపచేశారు. బాలాత్రిపురసుందరి గ్రంథాలయ పాలకులు వై.వి ఫణికుమార్, ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

కళాకారుల నృత్యం

నేటి నుంచి అద్దంకి నాంచారమ్మ జాతర మహోత్సవాలు

ప్రజాశక్తి-కోడూరు

కోడూరు మండల పరిధిలోని విశ్వనాథపల్లి గ్రామంలోని శ్రీ అద్దంకి నాంచారమ్మ తల్లి జాతర మహోత్సవాలు సోమవారం నుండి ప్రారంభం కానున్నాయని ఆలయ కార్యనిర్వహణాధికారి పామర్తి సీతారామయ్య తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమ, మంగళవారాల్లో నాంచారమ్మ తల్లి జాతర మహోత్సవాన్ని ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. సుదూర ప్రాంతాల నుండి వస్తున్న భక్తులు ఎవరు కూడా ఎలాంటి ఇబ్బందులు పడకుండా, ప్రశాంతమైన వాతావరణంలో అమ్మవారిని దర్శించుకోవడానికి ఏర్పాటులు చేసినట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే దేవాలయం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆయన అన్నారు. ఎక్కడ కూడా భక్తులకి ఇబ్బందులు పడకుండా జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. దాదాపు లక్ష మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున రద్దీని తట్టుకునే విధంగా పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అమ్మవారి జాతర మహోత్సవానికి గుంటూరు, ప్రకాశం జిల్లా, ఎన్టీఆర్ జిల్లా , కృష్ణాజిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రం నుండి కూడా పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

డిసి విజయరాజు ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-కోడూరు

కోడూరు మండల పరిధిలోని విశ్వనాథపల్లి గ్రామంలోని శ్రీ అద్దంకి నాంచారమ్మ తల్లి అమ్మవారిని కాకినాడ దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ మేడిపల్లి

విజయరాజును సత్కరిస్తున్న అధికారులు, అర్చకులు

విజయరాజు దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయం వద్ద ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనను ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ రెండు రోజులు పాటు జరిగే అద్దంకి నాంచారమ్మ తల్లి జాతర మహోత్సవానికి దేవాదాయ శాఖ అధికారులు భక్తులకు ఎక్కడా ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు సుధాకర్, పామర్తి సీతారామయ్య, ఆలయ కమిటీ చైర్మన్ ముప్పరిశెట్టి శ్రీనివాసరావు, ఆలయ గుమస్తా ప్రసాద్ తదితరులు ఉన్నారు.

జాతరకు పటిష్ట బందోబస్తు

ప్రజాశక్తి-మోపిదేవి

మండల పరిధిలోని పెదప్రోలు గ్రామంలోని శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారి జాతరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చల్లపల్లి సిఐ బి.బి రవికుమార్ తెలిపారు. ఆదివారం రాత్రి ఆలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అవనిగడ్డ డిఎస్పి పర్యవేక్షణలో సుమారు 200 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో పెదప్రోలు పిఏసిఎస్ చైర్మన్ ఆది రాంబాబు, ఆలయ అభివద్ధి కమిటీ చైర్మన్ కుర్ర గురు ప్రసాద్, పాలకవర్గ చైర్మన్ ఆకుల వెంకటరామయ్య, పంచాయతీ కార్యదర్శి పేర్ని మాధవేంద్రరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చైర్మన్

ఇండియన్ డెంటల్ అసోసియేషన్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

స్థానిక ఐఎంఎ భవనంలో ఆదివారం

స్టాల్‌ను పరిశీలిస్తున్న డాక్టర్లు

ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర ఐడిఎ అధ్యక్షులు డాక్టర్ ఎం శశిధర్, జనరల్ సెక్రటరీ డాక్టర్ అజయ్ బెనర్జీ, ముఖ్య అతిథి గవర్నమెంట్ డెంటల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు చేతుల మీదుగా నూతనంగా ఇండియన్ డెంటల్ అసోసియేషన్ (ఐడిఎ) జిల్లాశాఖను ప్రారంభించారు. తొలుత ట్రినిటీ స్పోట్స్‌లో డెంటల్ డాక్టర్లకు బాక్స్ క్రికెట్, పలు స్పోర్ట్స్, సలాడ్ ఈవెంట్ నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఐడిఎ కష్ణా జిల్లాశాఖకు అధ్యక్షులు డా. శ్రీరంగ శ్రీనివాసులు, కార్యదర్శి డా. కిరణ్, కోశాధికారిగా డా. ఫియోఫిలిస్ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఎ అధ్యక్షులు డా శివప్రసాద్, కార్యదర్శి బాలసుబ్రమణ్యం, మెంబర్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా డా. షేక్ మెహబూబ్, ఐడీఎ కోస్టల్ ఆంధ్ర అధ్యక్షులు డా గోవర్ధన్, ఐడీఎ కోస్టల్ ఆంధ్ర కార్యదర్శి డా. రామ్ సునీల్, డా. రావి శ్రీనివాస్,డెంటల్ డాక్టర్లు, మహిళా

ధర్నాలో పాల్గొన్న సిపిఎం నాయకులు

గ్యాస్ ధరలు తగ్గించాలని ధర్నా

ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం)

పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్‌చేస్తూ ఉంగుటూరు సెంటర్లో సిపిఎం ఆధ్వర్యంలో కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. సిపిఎం మండల కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు, వెన్నూతల సర్పంచ్ రామ్మోహననావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.450 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర నేడు రూ.1125కు పెరిగిందన్నారు. గ్యాస్ సబ్సిడీకి మంగళం పాడిందన్నారు. పేద ప్రజలకు సబ్సిడీ పథకాలు లేకుండా చేయాలనేది మోడీ కుట్ర అని విమర్శించారు. గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించే వరకూ ప్రజలు ఉద్యమం చేపట్టాలన్నారు.అన్ని రకాల వస్తువుల ధరలు పెరిగిపోతుండటం ఆందోళన కల్గిస్తోందన్నారు. సామాన్య, మధ్య తరగతి ప్రజలు బ్రతకటమే కష్టంగా మారిందన్నారు. పెరిగిన ధరలను తగ్గించే వరకూ పోరాడాలని కోరారు. ఉంగుటూరు మండలానికి చెందిన సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

చైల్డ్ హుడ్ గ్రూప్ చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-అవనిగడ్డ

చైల్డ్ హుడ్ గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం కోర్ట్ సెంటర్లోని కామాక్షమ్మ ఆలయం షాపింగ్ కాంప్లెక్స్ వద్ద

ప్రారంభిస్తున్న డిఎస్‌పి మహబూబ్‌భాష

చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా దీనిని అవనిగడ్డ డిఎస్పి మహబూబ్ బాషా, సిఐ జి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక మండలాల్లోని హోంగార్డులు పోలీస్ సిబ్బందికి రూ.50 వేలు ఖరీదు చేసే కూలింగ్ వాటర్ బాటిల్స్ ను డీఎస్పీ సీఐ చేతుల మీదుగా బహుకరించారు. కోడూరు నాగాయలంక మండలాల్లోని పోలీస్ స్టేషన్‌కు గ్రూప్ సభ్యులు వెళ్లి హోంగార్డు, పోలీస్ సిబ్బందికి వాటర్ బాటిళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ అధ్యక్షులు మత్తి శ్రీనివాసరావు, తెలంగాణ అడ్మిన్ తులసిరావు, ఎపి అడ్మిన్ లీలా కృష్ణ, సభ్యులు సామర్ల మల్లికార్జునరావు, అలపర్తి గోపాలకృష్ణ, యాసం శోభన్‌బాబు, చిన్నారి కొండవీటి లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్లో 'స్పందన'

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

మచిలీపట్నం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ భాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా శాఖల ఉన్నతాధికారులు ఉదయం 10 గంటలకు స్పందన కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. డివిజన్, మండల స్థాయిలోనూ స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

మిక్సీ గోడౌన్‌లో భారీ అగ్నిప్రమాదం

హైకోర్టు న్యాయమూర్తికి సత్కారం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.ప్రవీణ్ కుమార్ పదవీ విరమణ, సత్కార సభ ఆదివారం సాయంత్రం నగరంలోని శేషసాయి కళ్యాణమండపంలో ఘనంగా జరిగింది. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కార కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు కె.సురేష్ రెడ్డి, నయనాల జయసూర్య, సుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి పలువురు మాట్లాడారు. జస్టిస్ ప్రవీణ్‌కుమార్ న్యాయమూర్తి స్థానంలో ఉన్నప్పటికీ న్యాయవాదులతో చాలా ఆప్యాయతగా ఉండేవారన్నారు. ఆయన తండ్రి పద్మనాభ రెడ్డి బాటలో నడిచారన్నారు. హైకోర్టు చరిత్రలో ప్రవీణ్‌కుమార్ ముద్ర ఎప్పటికీ ఉంటుందన్నారు. ప్రవీణ్‌కుమార్ పదవీ విరమణ చేసినప్పటికీ ఆయనపై మరిన్ని బాధ్యతలు ఉన్నాయని తెలిపారు. న్యాయవాదుల్లో సామాజిక చైతన్యం తీసుకువచ్చే విధంగా అనేక కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. ఈకార్యక్రమంలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్, రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు, బార్ కౌన్సిల్ సభ్యులు ముప్పాళ్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-వన్‌టౌన్: చిట్టినగర్ ఆంజనేయ వాగు సెంటర్ కొండ ప్రాంతంలో ఈనెల 3వ తేదీన రెండు గ్రూఫ్‌ల మధ్య జరిగిన గొడవల నేపథ్యంలో ఇద్దరు వ్యక్తులను టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు చిట్టినగర్ బంగారయ్య కొట్టు సెంటర్‌కు చెందిన కునిపిల్ల హరి (31), ఆంజనేయవాగుకు చెందిన రాచకొండ శ్రీనివాసరావు అలియాస్ శ్రీనును ఆదివారం అరెస్టుచేసి కోర్టుకు తరలించగా, రిమాండ్ విధించినట్లు తెలిపారు. మిగతా వారి గురించి విచారిస్తున్నట్లు టూటౌన్ సిఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

ప్రజాశక్తి-భవానీపురం: విజయవాడ భవానీపురంలోని హోమ్ అప్లియన్స్ గోడౌన్‌లో ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగటంతో అందులోని వస్తువులు కాలి బూడిదయ్యాయి. తెలిసిన సమాచారం మేరకు భవానీపురం 40వ డివిజన్ డాల్ఫిన్ బార్ రోడ్డులో గల చిట్లూరి సత్యనారాయణకు చెందిన ఇంటి భవనాన్ని ఓ మార్వాడీ అద్దెకు తీసుకుని "అశోక్ ట్రేడర్స్ మిక్సీ గోడౌన్" నిర్వహిస్తున్నాడు. ఇంటికి సంబంధించిన వస్తువులైన మిక్సీలు, గ్రైండర్లు, ఫ్యాన్లు ఇలా పలు రకాల వస్తువులైన హోమ్ అప్లియన్స్ గోడౌన్ నిర్వహిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం అశోక్ ట్రేడర్స్ మిక్సీ గోడౌన్ మొదటి అంతస్తులో అగ్నిప్రమాదం చోటుచేసుకుని, మంటలు వ్యాపించాయి. దీంత వెంటనే స్థానికులు అగ్నిమాపక అధికారులకు ఫోన్ చేసి సమాచారం అందించారు. భవానీపురం పోలీస్‌స్టేషన్ సిఐ ఎం.డి. ఉమర్, సిబ్బంది కూడా హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. చిట్టినగర్ పరిసర ప్రాంతాల నుంచి నాలుగు ఫైరింజన్ల సాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఆదివారం కావటంతో గోడౌన్ నిర్వాహకులు ఎవరూ లేరు. అయితే అగ్ని ప్రమాదం సంభవించటంతో అశోక్ ట్రేడర్ మిక్సీల గోడౌన్‌లోని హోమ్ అప్లియన్స్ వస్తువులు చాలావరకూ కాలి బూడిదయ్యాయి. అయితే ఈ అగ్నిప్రమాదం ఎలా జరిగిందనేది విచారణ చేస్తున్నట్లు భవానీపురం సిఐ ఎం.డి. ఉమర్ తెలిపారు. సంబంధిత నిర్వాహకులు అందుబాటులో లేకపోవటంతో ఆస్థి నష్టం ఎంత అనేది తెలియరాలేదు. ఈ సంఘటనలో అగ్నిమాపక

కాలి బూడిద అవుతున్న అశోక్ ట్రేడర్స్ మిక్సీ గోడౌన్

శాఖాధికారి డిఎఫ్ఓ ఎం. శ్రీనివాసరావు, పశ్చిమ ఏసిపి కె. హనుమంతరావు, భవానీపురరం సిఐ ఎం.డి. ఉమర్, పోలీస్ సిబ్బంది, స్థానిక కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయ రెడ్డి, ఫైర్ సిబ్బంది పాల్గొని మంటలను అదుపులోకి తెచ్చి పరిస్థితిని చక్కదిద్దారు.

దుర్గమ్మ దర్శనానికి తరలివచ్చిన యాత్రికులు

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఇంద్రకీలాద్రి దుర్గమ్మను దర్శించుకునేందుకు ఆదివారం యాత్రికులు అధికసంఖ్యలో తరలివచ్చారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లును చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి దర్భముళ్ల భ్రమరాంబ పర్యవేక్షించారు. ఖడ్గమాలార్చన, లక్షకుంకుమార్చన, శ్రీచక్రనవావరణార్చన, చండీహెూమం, శాంతికళ్యాణం మరియు ఇతర సేవల యందు విశేషముగా పాల్గొని, శ్రీ అమ్మవారిని స్వామివారిని దర్శించుకున్నారు. ఇంద్రకీలాద్రి దుర్గమ్మను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు, సినీ గాయకులు సాకేత్, హారిక, సోని ఆదివారం దర్శించుకున్నారు.

ఊర్మిళానగర్‌లో 'ఇదేం ఖర్మ'

ప్రజాశక్తి-భవానీపురం: పేద ప్రజలను జగన్ ప్రభుత్వం అనేక విధాలుగా మోసం చేస్తోందని తెలుగుదేశం మైనార్టీ నాయకులు ఎంఎస్. బేగ్ విమర్శించారు. తెలుగుదేశం పార్టీ ప్రజా సమస్యల సేకరణకై తలపెట్టిన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం ఆదివారం 43వ డివిజన్ అధ్యక్షులు దూది బ్రహ్మయ్య ,క్లస్టర్ యూనిట్ ఇన్చార్జిల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్‌లో నాయకులు పర్యటించి ప్రజల నుంచి సమస్యలు సేకరించడం జరిగింది ఈ సందర్భంగా ఎంఎస్. బేగ్ మాట్లాడుతూ సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారని అన్నారు. ఈ డివిజన్‌లో ముఖ్యంగా రోడ్లు డ్రైన్లు సమస్య అధికంగా ఉందని ప్రజలు తెలియజేయడం జరిగిందన్నారు. భర్త చనిపోయి ఐదు సంవత్సరాలైనా పింఛన్ రావడం లేదని ఒక వద్ధురాలు తెలియజేసిందని చెప్పారు. ప్రజాశక్తి నగర్‌లో ఇళ్లకు రిజిస్ట్రేషన్లు చేయిస్తామని చెప్పి మోసం చేసిన ప్రభుత్వం ఇప్పటివరకు పట్టాలిప్పించలేదని అన్నారు. గత 2014 సంవత్సరంలో పేదల కోసం నిర్మించిన టిడ్కో ఇళ్లను ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేసి నేటికి కూడా పంపిణీ చేయని దౌర్భాగ్య పరిస్థితుల్లో ప్రభుత్వం నడుస్తుందని స్థానిక ప్రజలు ఎంఎస్ బేగ్ దష్టికి తీసుకొని వచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కార్యాలయ కార్యదర్శి సారిపల్లి రాధాకష్ణ, నాయకులు పాపారావు, అప్పన్న ,టైలర్ వెంకటేశ్వర్లు, ఈశ్వర్, జ్యోతి, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **PUSHADAPU PRABHU KUMARI** W/O. **PUSHADAPU PARISUDDABABU**, R/o D. No, 8-00. Nagayalanka Village and Mandal, Avanigadda (V)&(M) Krishna District. I have changed my name from **BANGARU BABI MANDALI** D/O. **SEETHA RAMAIAH** (Before marriage) to **PUSHADAPU PARISUDDABABU** H/O. **PUSHADAPU PRABHU KUMARI** (After Marriage)., Please accept the above mentioned both (**PUSHADAPU PRABHU KUMARI @ BANGARU BABI MANDALI**) Names are one and the same and belongs to me. My actual Name is **PUSHADAPU PRABHU KUMARI** W/O, **PARISUDDABABU**, Vide Affidavit No 1688 Dt.04/03/2023 Sworn before the notary Vaddi Ravindra, Avanigadda.

మొదటిపేజీ తరువాయి

సమస్యల వలయంలో పిఎన్ బస్టేషన్

కూడా తిరగడం లేదు. మధ్యాహ్నం సమయంలో ఉక్కపోస్తూ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్‌స్టేషన్‌లో సెక్యూరిటీ నామ్‌కే వాస్తేగా తయారయ్యింది. చోరీలను అడ్డుకట్ట వేయాలన్నా సరైన సెక్యూరిటీ లేక పలు రకాల దొంగతనాలకు బస్‌స్టేషన్ నిలయంగా మారిందని చెప్పక తప్పదు. కుక్కల బెడద కూడా ఎక్కువుగా ఉంది. డిపార్చర్ బ్లాక్‌లో కుక్కలు స్వైర విహారం చేస్తూ, పెద్ద సంఖ్యలో బస్‌స్టేషన్‌లోనే సంచరిస్తున్నా వాటిని అక్కడ నుంచి పంపించే నాథుడే ఉండటం లేదు. అలాగే బెగ్గర్స్ దగ్గర నుంచి అనుమానితులు అనేక మంది బస్‌స్టేషన్‌లోనే రోజుల తరబడి తిష్టవేస్తున్నా తమకు సంబంధం లేదనే వైఖరితో అధికారులు వ్యవహరిస్తున్న తీరు పట్ల తీవ్రమైన విమర్శలు వినిపిస్తున్నాయి. తగినన్ని ప్లాట్‌ఫారమ్స్ లేక పలు సర్వీసులు ఒక దాని వెంట మరొకటి ఇరుకు ఇరుకుగా పార్కింగ్ చేసుకోవాల్సి వస్తోంది. కొన్ని సందర్భాల్లో వీటిని క్రమబద్ధీకరణ చేయలేక ఆర్టీసీ కంట్రోలర్స్‌కు తలకు మించిన భారంగా తయారయ్యింది. మంచినీటి సదుపాయం కూడా ప్రయాణీకులకు అందుబాటులో లేక, ఎంఆర్‌పి కన్నా అదనంగా ధర పెట్టి మంచినీళ్ల బాటిళ్లను కొనుగోలు చేయాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. వీటిని నియంత్రించే నాథుడే ఉండటం లేదని పలువురు విమర్శిస్తున్నారు. పండిత నెహ్రూ బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ప్రయాణీకులు కోరుతున్నారు.

ప్రజలకు నాణ్యమైన వైద్యం

ముఖ్యమంత్రి చేస్తున్న కషి అభినందనీయమని 13 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించి రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు కషి చేస్తున్నారని రాబోయే రోజుల్లో ఈ రాష్ట్రంలో యువతకు నిరుద్యోగులకు మంచి రోజులు రానున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతీ దేవి, జెడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, గ్రామ సర్పంచ్ గోరుముచ్చు ఉమా, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ డి.నాగలక్ష్మి, వైసిపి నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు నలుకుర్తి పృధ్వీరాజ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

6 వ తరగతి వరకు చదివే ఒక్కొ విద్యార్థికి రూ. 130, ఏడు నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు రూ.155 చొప్పున కాస్మోటిక్ ఛార్జీలు చెల్లిస్తున్నాం. జిల్లాలో 592 మంది విద్యార్థులకు ఫీజ్ రీయింబర్స్ మెంట్ కింద రూ. 1 కోటి 69 లక్షలు, 539 మందికి వసతి దీవెన కింద రూ. 61 లక్షల 32 వేలు అందించాం. పేద విద్యార్థులు విద్యకు దూరం అవ్వకుండా ప్రభుత్వ పథకాలు దోహద పడుతున్నాయి.

ప్ర: ఆర్‌వోఎఫ్ఆర్‌లో అటవీ భూములపై ఎందరు గిరిజనులు హక్కు సాధించారు?

జ: అటవీ భూముల హక్కు చట్టం కింద బాపులపాడు మండలంలో గతంలో 38 మందికి 74.69 ఎకరాలు భూములపై హక్కు కల్పించాం. ఈ మండలంలోని మడిచర్ల గ్రామంలో మరో 18 కుటుంబాలను అర్హులుగా గుర్తించాం. 18.81 ఎకరాలను ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలను త్వరలోనే మంజూరు చేయడానికి కృషి చేస్తున్నాం.

ప్ర: గిరిజన కాలనీల అభివృద్ధికి నిధులు విడుదల అవుతున్నాయా?

జ: గిరిజనుల నివాస ప్రాంతాల్లో మౌలిక వసతులు ఏర్పాటుకు ఇయర్ మార్కింగ్ ఫండ్ నిధులు వెచ్చించడం జరుగుతోంది. మండల పరిషత్ కార్యాలయాలకు వచ్చే ఆదాయంలో 2 శాతం ఈ ఫండ్‌కు కేటాయిస్తున్నారు.

గ్రామ పంచాయితీ కార్యాలయం. కీర్తిరాయుని గూడెం

టెండర్ ప్రకటన

ఆర్.ఓ.సి.నెం.5/2023 **తేది:06.03.2023.**

ఎన్‌టిఆర్ జిల్లా , మైలవరం మండలం కీర్తిరాయుని గూడెం గ్రామ పంచాయతీ నందు కాంట్రాక్టు లేబర్ సప్లయ్ నిమిత్తం అనుభవం గల ఏజన్సీ లేదా సప్లయ్ దారుల నుండి 2023-24 ఆర్థిక సం॥రము అనగా (ది:01-04-2023 నుండి 31-03-2024 వ తేది వరకు) ఈ దిగువ షెడ్యుల్ లో చూపించిన ప్రకారం పనులు చేయుటకు గాను ది:09-03-2023వ తేది మధ్యాహ్నం గం॥ 2.00 ని॥లకు సీల్డ్ టెండర్లు సదరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి వారిచే గాని మరియు వారి అనుమతి పొందిన వారు స్వీకరించబడును. టెండర్ దాఖలు చేయు వారు నిర్ణిత టెండర్లు రుసుము చెల్లించి టెండర్లు దాఖలు చేయవలెను. టెండర్లుదారుల సమక్షములో అదే రోజు మధ్యాహ్నం గం॥ 03.00 ని॥ లకు అప్పటి హాజరైన టెండరు దారుల సమక్షంలో సీల్డ్ టెండర్లు తెరవబడును. టెండరు షరతులు, ఇతర వివరములుకి పంచాయతీ కార్యాలయం పని చేయు వేళ యందు పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకొనవచ్చును.

వ .నెం	పని పేరు	కాల పరిమితి	ధరావత్తు
1.	మంచి నీటి సరఫరా నిర్వహణ -1 పారిశుధ్య నిర్వహణ -1 మరియు వీధి దీపాల నిర్వహణ పనులు - 1	01.04.2023 నుండి 31-03-2024 వరకు	1000 /-

గమనిక : 1.గతంలో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
2. పంచాయతీ నిధుల లభ్యతను బట్టి చెల్లింపులు జరపబడును .

సం/- ఎం. దుర్గా మౌనిక,,
పంచాయతీ కార్యదర్శి,
కీర్తిరాయుని గూడెం గ్రామ పంచాయతీ

సం/- బొర్రా శోభనాద్రి,
సర్పంచ్,
కీర్తిరాయుని గూడెం గ్రామ పంచాయతీ.

'విద్యతోనే అసమానతలు అంతం'

గుడివాడ : విద్యతోనే సమాజంలో అసమానతలు తొలగింపు సాధ్యమని మున్సిపల్ కమిషనర్ వడ్లాది మురళీకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక ధనియాలపేటలోని ప్రణవాశ్రమం పర్యవేక్షణలో నిర్వహిస్తున్న త్రివిక్రమ బాల చాత్రాలయం 16వ వార్షికోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యతోనే దేశభివృద్ధి ముడిపడి ఉందన్నారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అర్థిక వితరణతో అందించిన ఎల్ఇడి టివిని విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ పీఠాదిపతి సైర్వానంద సరస్వతి, పర్వతనేని చంద్రశేఖరరావు, నారయణరెడ్డి, డిఆర్‌బి ప్రసాద్, రామథేణు వేణుబాబు, వీరశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

చిత్త శుద్ధి గల నాయకుడు జగన్ : శివాజీరాజు

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్(గన్నవరం)

రాష్ట్ర అభివృద్ధికి సీఎం జగన్ చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు ప్రముఖ పారిశ్రామికవేత్త వై.కా.పా నాయకులు శివాజీ రాజు అన్నారు. ఆదివారం హనుమాన్ జంక్షన్‌లో ఆయన మాట్లాడుతూ ఈనెల 3,4 తేదీ ల్లో వైజాగ్‌లో జరిగిన గ్లోబల్ సమిట్ లో మన రాష్ట్రానికి పెద్ద పెద్ద కంపెనీలు ముందుకు వచ్చి పెట్టుబడులు పెట్టడం అభినందనీయమన్నారు. 2019లో వైసిపి ప్రభుత్వ అధికారంలోకి వచ్చినప్పటి నుండి పేదలకు అండగా నిలుస్తున్నామన్నారు. సంవత్సరానికి జివిస్టీలో దేశం మొత్తంలో 20 శాతం ఉంటే మన రాష్ట్రంలో 26 శాతం వస్తోందన్నారు. వై.సి.పి నాయకులు కార్యకర్తలు కేక్ కట్ చేసి ఆనందం వ్యక్తం చేశారు.

సత్యనారాయణకు సతీవియోగం

ప్రజాశక్తి-అవనిగడ్డ

అవనిగడ్డ మాజీ సమితి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, అవనిగడ్డ గ్రామ మాజీ సర్పంచ్ అన్నపరెడ్డి సత్యనారాయణ సతీమణి అన్నపరెడ్డి సుఖ వేణమ్మ ఆదివారం మరణించారు. ఆమె మృతికి అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు తీవ్ర సంతాపం తెలిపారు. మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ కూడా సంతాపం వ్యక్తం చేశారు. వారితోపాటు పట్టణంలోని పలువురు ప్రముఖులు సుఖవేణమ్మ భౌతికకాయాన్ని సందర్శించి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణను పలువురు పరామర్శించి సానుభూతిని వ్యక్తంచేశారు.

ఉల్లిపాలెంలో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి-కోడూరు

కోడూరు మండలం ఉల్లిపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని పరుచూరి వారి పాలెం గ్రామానికి చెందిన సుంకర బాబురావు ఇల్లు ఆదివారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదానికి గురై ఇంటిలోని గృహోపకరణ వస్తువులు, విలువైన డాక్యుమెంట్లు కాలిపోగా విషయాన్ని తెలుసుకున్న కోడూరు మండల టిడిపి నేతలు సుంకర బాబురావుని పరామర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బండే శ్రీనివాసరావు, కాగిత రామారావు, బొలిశెట్టి విటల్ రావు, జరుగు వెంకటేశ్వరరావు, కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, బొడ్డు వెంకన్న తదితరులు పాల్గొన్నారు

23 మంది పేకాటరాయుళ్లు అరెస్ట్

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

మండలంలోని వేమవరం శివారు ఆంజనేయ రెస్టరూములో ఆదివారం పేకాట నిర్వహిస్తున్న 23 మందిని అరెస్ట్‌చేసి వారి వద్ద నుంచి రూ.2.86 లక్షల నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వి ఏసేబు తెలిపారు. ఈ శిబిరంలో పాల్గొన్న వారిలో గుడివాడకు చెందిన ఎక్కువ మంది ఉన్నట్లుగా సమాచారం.

సైక్లింగ్‌తో మంచి ఆరోగ్యం : ఎడిఎంహెచ్‌ఓ

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

మగువలకు సైక్లింగ్ శారీరక వ్యాయామం, అందంతోపాటు ఆరోగ్యం కూడా అందిస్తుందని టీబి ఆసుపత్రి, ఎయిడ్స్ కంట్రోల్ జిల్లా అధికారి, అడిషనల్ డిఎంహెచ్‌ఓ వెంకట్రావు అన్నారు. ఆజాదీకా అమృత మహోత్సవంలో భాగంగా కృష్ణాజిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో హెల్దీ ఉమెన్ హెల్దీ

ర్యాలీలో పాలొగన్న ఎడిఎంహెచ్‌ఓ వెంకట్రావు

ఇండియా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలు విద్యార్థులు ఆదివారం స్థానిక పరాసుపేట నుండి కలెక్టరు బంగ్లా వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆజాదీకా అమృత మహోత్సవంలో భాగంగా ప్రతి ఆదివారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి గీతాభాయి ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సైక్లింగ్ మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రోజూ వ్యాయామంలో సైక్లింగ్ ఒక భాగంగా చేసుకోవాలని కోరారు. నేషనల్ హెల్త్ మిషన్ డిస్టిక్ పోగ్రాం మేనేజింగ్ ఆఫీసర్ సుదర్శన్ మాట్లాడుతూ మనం తినే జంక్ ఫుడ్స్ అనారోగ్యానికి కారణమన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. శారీరక, మానసిక ఉల్లాసానికి సైక్లింగ్ మహిళలకు అవసరమని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలు ఆరోగ్యంగా ఉండటానికి అనేక పథకాలు ప్రవేశపెట్టాయన్నారు. మహిళలు చిన్న తనం నుండే పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. స్టార్ కళాశాల డైరెక్టర్ శ్రీరామ్ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యవంతంగా ఉంటే సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. బాలికలు ఆరోగ్యంగా ఉండేందుకు సైక్లింగ్ ఎంతో అవసరమన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ద్విచక్ర వాహనాలు, కార్లపై ప్రయాణించకుండా తక్కువ దూరం వెళ్లేవారు సైకిల్‌పై వెళ్లాలన్నారు. 20 ఏళ్ళ క్రితం సైకిల్ తొక్కేవారు ఎక్కువగా ఉండేవారన్నారు. ఇలా సైకిల్‌పై ప్రయాణం చేయడంతో ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడపగలరన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీబి పబ్లిక్ అండ్ ప్రైవేట్ కోఆర్డినేటర్ పి మధుసూధనరావు, రామకృష్ణ , సుభాషిణి, డిఆర్ టీబి కోఆర్డినేటర్ ధనలక్ష్మి, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, స్టార్ కాలేజీ విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యువత ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొనాలి : డిఎస్‌పి

గన్నవరం : యువత ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొని దేశ కీర్తిని ఇనుమడింపజే యాలని ఏ.పీ.యస్.పి మంగళగిరి ఆరో బెటాలియన్ డిఎస్‌పి ఎన్.బి.ఎం మురళీకృష్ణ అన్నారు. కృష్ణాజిల్లా ఫెన్సింగ్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గన్నవరం మండలం దావాజీగూడెం ఎస్.వి.ఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఉమ్మడి కృష్ణాజిల్లా స్త్రీ, పురుషుల ఫెన్సింగ్ జట్ల ఎంపిక కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోమంది ప్రతిభావంతులైన క్రీడాకారులు సరైన అవకాశాలు రాక వెలుగులోకి రాలేక పోతున్నారన్నారుఫెన్సింగ్ శిక్షకులు చల్లారాం మాట్లాడుతూ క్రమశిక్షణ పట్టుదలతో సాధన చేస్తే క్రీడలలో రాణించగలరన్నారు. వ్యాయామవిద్య ఉపాధ్యాయులు, ఫెన్సింగ్ నిర్వాహకులు, ధనియాల నాగరాజు మాట్లాడుతూ నిరంతర సాధన ఉన్నప్పుడే ఉత్తమ క్రీడా ఫలితాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ సొసైటీ చైర్మన్ సంక బత్తుల వెంకట్రావు, వ్యాయామ ఉపాధ్యాయులు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కోతుల భారి నుండి రక్షించండి మహాప్రభో..!

ప్రజాశక్తి - మొవ్వ

మొవ్వ మండలంలోని అవిరిపూడి, పాలంకిపాడు గ్రామాల ప్రజానీకానికి కోతుల బెడద కంటిమీదకునుకు లేకుండా చేస్తోంది. విపరీతంగా

పెరిగిన వానర సంతతి గ్రామాల్లో శాస్వత వసతి ఏర్పాటు చేసుకుని గ్రామస్తుల ఇళ్ళుపీకి పందిరేస్తున్నాయి. క్షణకాలంలో ఇళ్లల్లోని ఆహార పదార్థాలు, తినుబండారాలను తస్కరించి తమ ఆకలి తీర్చుకుంటూ జనాల కడుపుకొడుతున్నాయి. ఇదే సమయంలో ఫల సాయాన్ని అందించే కొబ్బరి, అరటి,జామ తదితర చెట్లతో పాటు పెరటి మొక్కలపై ఒక్కసారిగా దాడిచేసి ఆటలాడుతూ, ఫలాలను పాడుచేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. గ్రామాల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తున్న వానర గ్యాంగ్ ప్రజలను హడలెత్తిస్తున్నాయి. మహిళలు, చిన్నపిల్లలు ఒంటరిగా కనిపిస్తే ఒక్కసారిగా మీదపడి చేతిలోని వస్తువులను గుంజుకుని ఉడాయిస్తున్నాయి. ధైర్యం చేసి అడ్డుకునే ప్రయత్నం చేస్తే గోళ్ళతో రక్కేసి, కరిచి గాయపరుస్తున్నాయి. కోతుల ఆగడాలతో ఆదమరిస్తే ఇంతేసంగతులన్నట్లుగా తయారైంది ప్రస్తుతం వారి పరిస్థితి. గ్రామస్థులంతా కలిసి పలుమార్లు కోతులను గ్రామాంతరం తరిమినా తిరిగి ఇక్కడికే వచ్చేస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతుల బెడద నుండి తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను పంచాయతీ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకోగా కొండముచ్చుని రప్పించి ఓసారి కోతులను తరిమించారని మళ్ళీ తిరిగి వచ్చి తిష్టవేయడంతో సమస్యను గాలికొదిలేశారని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సంతానోత్పత్తితోషుమారు వెయ్యికి పైగా చేరిన వానర సైన్యం మనుషులపై దాడులకు తెగబడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని వాపోతున్నారు. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ఎటునుండి వచ్చి ఏమి ఎత్తుకుపోతాయో,ఎవరిపై దాడిచేస్తాయోనని భయంతో కాలంగడుపుతున్నట్లు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోతుల బెడతతో తాము అన్నిరకాలుగాను నష్టపోతున్నామని ఇప్పటికైనా సంభందిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కోతుల బారినుండి తమకు విముక్తి కలిగించాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు శీలం నారాయణరావు

రైతులు, గ్రామస్తులను తీవ్ర ఇబ్బందులు కల్గిస్తున్న కోతుల సమస్యకు సంబంధిత అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలి. అవిరిపూడి, పాలంకిపాడు, చినవంతె వి, నిమ్మకూరు,మంత్రిపాలెం గ్రామాల్లో నేను పర్యటించాను. స్థానికులు, రైతులు కోతులతో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఏకరువు పెట్టారు. కోతుల కారణంగా జరిగిన నష్టాలను ప్రత్యక్షంగా చూపారు. సమస్య పరిష్కారం కోసం ఇప్పటికే పలువురు స్థానిక అధికారులు, గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామాలకు వచ్చిన స్థానిక ఎంఎల్ఎ కైలే అనిల్ కుమార్ దృష్టికి సమస్య తీసుకెళ్లినా పరిష్కారానికి నోచుకోలేదు. వృద్దులు, పిల్లలు, వికలాంగులు ఇలా అందరిపైనా దాడిచేస్తున్నాయి.

నేడు, రేపు మహిళా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

స్థానిక మహతి లలిత కళా వేదికపై సాంస్కృతిక సంస్థ భావ తరంగిణి అధ్వర్యంలో సోమ, మంగళవారాల్లో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ప్రముఖ సాహితీవేత్త భవిష్య తెలిపారు. రెండు రోజులపాటు సాయంత్రం 6 గంటల నుంచి కార్యక్రమాలు ప్రారంభమౌతాయని చెప్పారు. సోమవారం సాయంత్రం హాస్య నాటిక 'చంటోడి పెళ్ళి'ని కళాకారులు ప్రదర్శిస్తారని తెలిపారు. అనంతరం సభా కార్యక్రమాలు కొనసాగుతాయని వివరించారు. నిర్వహిస్తారన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మంగళవారంనాడు వివిధ రంగాలకు చెందిన మహిళలకు ఉత్తమ పురస్కారాలు, కవి సమ్మేళనం, గజల్స్ గానం, పద్యపఠనం ఉంటుందన్నారు. పురస్కార సభా కార్యక్రమాలకు సభాధ్యక్షులుగా ప్రపంచ తెలుగు రచయితల సంఘం అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు, ప్రత్యేక ఆహ్వానితులుగా బందరు ఆర్టీసీ డిపో మేనేజర్ టి.పెద్ది రాజు పాల్గొంటారని తెలిపారు.

ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి

ప్రజాశక్తి-ఉంగుటూరు

నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా వైఎస్సార్ జగనన్నకాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను ఉగాది నాటికి పూర్తయ్యేలా లబ్ధిదారులు కృషిచేయాలని ఎంపిడిఓ శేషగిరిరావు కోరారు. మండల కేంద్రమైన ఉంగుటూరులోని జగనన్న హౌసింగ్ లేఔట్‌ను ఆదివారం ఆయన సందర్శించారు. రూ.33 లక్షలతో జరుగుతున్న మెరక పనులను ఆయన దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే శంకుస్థాపన చేయని వారు ఉగాది నాటికి ప్రతి ఒక్క లబ్ధిదారుడు శంకుస్థాపన చేయాలని కోరారు.

చలో ఢిల్లీని విజయవంతం చేయాలి

ఎపి కౌలు రైతుసంఘం కృష్ణాజిల్లా అధ్యక్షులు కె.శివనాగేంద్రం

ప్రజాశక్తి-పమిడిముక్కల

రైతులు, కౌలురైతులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏప్రిల్ 5వ తేదీన జరపతలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎపి కౌలు రైతుసంఘం కృష్ణాజిల్లా అధ్యక్షులు కోసూరు శివనాగేంద్రం కోరారు. సిఐటియు, ఎపి రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ పమిడిముక్కల మండలం ఐనంపూడి గ్రామంలో ఆదివారంనాడు కరపత్రాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శివనాగేంద్రం మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల ఆత్మహత్యలు మరింతగా పెరిగాయన్నారు. సిఐటియు కృష్ణాజిల్లా నాయకులు ఆర్.రఘు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేయటానికి పూనుకుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజులపాటి రామాంజనేయులు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతభాషపై అవగాహన

గుడివాడ : సంస్కృత భారతి గుడివాడ శాఖ బాలకేంద్రం ఆధ్వర్యంలో సంస్కృత భాషపై విద్యార్థులకు అవగాహన కల్పించడం అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక సత్యనారయణపురంలోని ఉపద్రష్ట సత్రంలోని బాలకేంద్రంలోని సంస్కృత భారతి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపద్రష్ట రామస్వామి శాస్త్రి, పిన్నమనేని భవాని, చోడవరపు విజయకుమార్, ఉపద్రష్ట రమణమూర్తి, దినవాహి కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

మత్స్య పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

మత్స్య ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పిస్తూ చిన్నచిన్న యూనిట్లతో లబ్ధిపొందే విధంగా రాయితీతో పథకాలను రూపొందించిందనీ ఎన్ఎఫ్డిబి సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వెంకట మాధురి అన్నారు. స్థానిక బందరుకోటలో నారాయణ సేవ సమితి, నేషనల్ ఫిషరీస్ డెవలప్మెంట్ బోర్డ్ (ఎన్ఎఫ్డిబి) సంయుక్త ఆధ్వర్యంలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంతో ఎఫ్ఎఫ్పిఓస్, మత్స్యకారులు, రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా ఎన్ఎఫ్డిబి మత్స్యకారులకు నేరుగా కేంద్ర ప్రభుత్వం లబ్దిదారులకు అవసరమైన శిక్షణ, ఉపాధి కల్పనకు దోహదపడే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు.

చిత్రకారుడు జగన్‌మోహనరావుకు సన్మానం

ప్రజాశక్తి-భవానీపురం: హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన గిరిజన గీతశిల్పిగా పేరుగాంచిన ప్రముఖ చిత్రకారుడు బొండా జగన్‌మోహనరావును బాలోత్సవ్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. ఆదివారం విజయవాడ గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో 64కళలు డాట్‌కామ్ వారి 12వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బొండా జగన్‌మోహనరావును మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ చేతుల మీదుగా సత్కరించారు. గిరిజనుల జీవితాలపై వందలాది చిత్రాలను గీయడం ద్వారా వారి అభ్యున్నతికోసం పాటుపడుతున్న బొండా సేవలను నిర్వాహకులు అభినందించారు. కాగా తనకు జరిగిన సత్కారం పట్ల బొండా జగన్‌మోహనరావు మాట్లాడుతు కృతజ్ఞతలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కళాపోషకులు గోళ్ల నారాయణరావు, ఎడిటర్ ఎల్లపు కళాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

7న శ్రీ వేణుగోపాలస్వామి కల్యాణం

ప్రజాశక్తి-వన్‌టౌన్: శ్రీ సత్యభామ రుక్మిణి సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారి కళ్యాణ మహోత్సవం ఈ నెల 7వ తేదీ సాయంత్రం ఘనంగా నిర్వహిస్తున్నట్లు కొత్తపేటలోని శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానం పాలకమండలి అధ్యక్షులు వంజరపు సూర్యారావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయ అభివద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నందున ఈ దఫా పరిమితమైన రీతిలో శ్రీ స్వామివారి కల్యాణోత్సవం జరుగుతుందని, భక్తులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు. దేవాలయ ప్రాంగణంలో కట్టడాల నిర్మాణం నిమిత్తం గోతులు తీసినందున భక్తులు ప్రమాదాలు బారిన పడకుండా ఉండేందుకు కల్యాణోత్సవాన్ని పరిమిత భక్తజనులతో నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. శ్రీ స్వామివారిని ప్రతిష్టించి ఈ సంవత్సరంతో 103 సంవత్సరాలు పూర్తయిందని తెలిపారు.

దేవాంగులకు ప్రాధాన్యత కల్పించాలి

ప్రజాశక్తి-విజయవాడ: రాబోయే 2024 సాధారణ ఎన్నికల్లో దేవాంగులకు తగిన రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేవాంగ కర్ణ నాగరాజు, పుచ్చల రామకృష్ణ కోరారు. విజయవాడ గాంధీనగర్ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దేవాంగ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించడంతో పాటు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఈ సమాజికవర్గం వారికి పలు అసెంబ్లీ, పార్లమెంట్‌స్థానాలు కేటాయించాలని కోరారు. చేనేత వర్గానికి చెందిన దేవాంగులను ఆయా ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని అన్నారు. ఎమ్మెల్సీ నామినేట్ పదవితో పాటు రాబోయే శాసన సభ ఎన్నికల్లో చీరాల, రాజమండ్రి, పెద్దాపురం, పుట్టపర్తి నాలుగు నియోజకవర్గాలు దేవాంగులకు కేటాయించాలని కోరారు. చేనేత వృత్తికి భారంగా తయారయిన నేత ముడి సరుకులపై జిఎస్‌టి ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కోశాధికారి ఉప్పు కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంగా ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ: మహిళలు ఆరోగ్యవంతమైన జీవితాన్ని కొనసాగించినప్పుడే ఆరోగ్యవంతమైన సమాజాన్ని ఏర్పాటు చేసుకోగలుగుతారని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. ఈ నెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో హెల్తీ ఉమెన్ హెల్తీ ఇండియా నినాదంతో నిర్వహించిన సైకిల్ ర్యాలీని నగరంలోని పాత ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నుంచి కలెక్టర్ ఆదివారం ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు సంపూర్ణ ఆరోగ్యవంతమైన జీవితాన్ని కొనసాగించడం ద్వారా మరింత ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడేందుకు దోహదపడుతుందన్నారు. మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం దేశ ప్రగతికి బాటలు వేస్తుందన్నారు. మహిళల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టి అంగన్‌శాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలలు విద్యార్థినులకు సంపూర్ణ పౌష్టికాహారాన్ని అందచేయడంతో పాటు రక్తహీనత నివారించేందుకు ఐరన్ టాబ్లెట్లను పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకుంటుందన్నారు. ర్యాలీలో డిప్యూటీ మేయర్లు అవుతు శైలజారెడ్డి, బెల్లందుర్గ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ సమరం, ఐసీడీఎస్ పిడి జి.ఉమాదేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎం.సుహాసిని, ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ ఉషారాణి, సీనియర్ హెల్త్

ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

ఆఫీసర్ డాక్టర్ జె.నరసింహనాయరక్, మలేరియా అధికారి డాక్టర్ మోతిబాబు, మహిళా సంక్షేమ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఫద్మావతి, డాక్టర్ జగదీష్ పాల్గొన్నారు.

రాకేష్ స్కూల్ విద్యార్థులకు అభినందన

ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో పాఠశాల డైరెక్టర్ ఎన్.వి.రావు

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఈ నెల 2, 3, 4 తేదీల్లో ఆంధ్రా లయోలా కళాశాలలో సేఫ్, ఎఎల్‌సి ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్- 2023లో చిట్టినగర్‌లోని కెఎల్ రావు నగర్‌కు చెందిన రాకేష్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటుకుని, బహుమతులను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం పాఠశాల యాజమాన్యం సంబంధిత విద్యార్థులకు అభినందన కార్యక్రమం జరిగింది. డ్రైవింగ్ చేసేవారు నిద్రలోకి జారుకుని కళ్లు మూస్తే అలారం మోగేటట్లుగా తయారు చేసిన పరికరానికి ఫిజిక్స్‌లో ద్వితీయ బహుమతిని అందుకున్నట్లు పాఠశాల డైరెక్టర్ ఎన్.వి. రావు తెలిపారు. అంతేగాక ఈ ప్రదర్శనలో నాలుగు సైన్సు ప్రయోగాలను ప్రదర్శించినట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు, ఆర్మీ వాళ్లకు ఉపయోగపడే పరికరం, వధాగా పడి ఉన్న ప్లాస్టిక్ నుండి పెట్రోలు, గ్యాస్ తయారు చేసే పరికరాన్ని 8, 9వ తరగతి విద్యార్థులు ప్రదర్శించిన ప్రయోగాలు ఎంతోమందిని ఆకట్టుకున్నాయని వివరించారు. ఈ పందర్భంగా వారిని డైరెక్టర్ ఎన్.వి. రావు అభినందించారు. ముఖ్యంగా ద్వితీయ బహుమతి పొందిన జి. వెంకటరమణ, సిహెచ్ వెంకటరమణ, కే. అఖిల్ బందాన్ని ముఖ్య అతిదిగా అమెరికాకు చెందిన వెల్స్‌ఫర్‌గో బ్యాంక్ ఉపాధ్యక్షులు బి.ఉదయ్ కిరణ్ విద్యార్థులను అభినందించారు. ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు చేతుల మీదుగా తమ విద్యార్థులు బహుమతులు అందుకోవటం అభినందనీయమని పాఠశాల డైరెక్టర్ ఎన్.వి.రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో గైడ్ టీచర్ జి.మల్లేశ్వరి, ఎస్. కాంతి, కల్పన తదితరులు పాల్గొని అభినందించారు.

7న వాహనాలకు వేలం

ప్రజాశక్తి-వన్‌టౌన్

వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కేసులలో సీజ్ చేయబడిన వాహనాలను ఈ నెల 7వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ రావి సురేష్‌రెడ్డి తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు టూ వీలర్‌కు రూ.5 వేలు, ఫోర్ వీలర్‌కు రూ.10 వేలు ముందస్తుగా చెల్లించాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు రైటర్ జి.శ్రీను 7981030190, సిఐ రావి సురేష్‌రెడ్డి 9440627076 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

ఎంసిపిఐ(యు) నగర కార్యదర్శిగా గణేష్

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఎంసిపిఐ (యు) విజయవాడ నగర కమిటీ ఎంపిక ఆదివారం విజయవాడ వన్‌టౌన్ వించిపేటలోని కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా కృష్ణాజిల్లా కార్యదర్శి గొల్లపూడి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంసిపిఐ (యు) నగర కార్యదర్శిగా కాసాని గణేష్‌బాబు, నగర యువజన సంఘం కార్యదర్శిగా కొండారెడ్డి ఇమ్మానియేలు ఎన్నికయ్యారు. వీరితో పాటు మరో మొత్తం 11 మందితో నగర కమిటీ ఏర్పాటైంది. ఈ కార్యక్రమంలో ఐసిటియు నాయకులు ఎస్.కె.ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

సార్ సినిమాపై ప్రత్యేక రాయితీ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఇటీవల విడుదలైన 'సార్' చిత్రం మంచి ప్రేక్షకాదరణ పొందిందని, సినిమాలోని సందేశాన్ని ప్రతి ఒక్కరికీ ముఖ్యంగా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అందించాలనే ఉద్దేశంతో ప్రత్యేక రాయితీతో సినిమా చూసే అవకాశం కల్పిస్తున్నామని జెపిఆర్ ఫిలిమ్స్ అధినేత, సినిమా డిస్ట్రిబ్యూటర్ డాక్టర్ పవన్‌కుమార్ తెలిపారు. నగరంలోని ఫిలిమ్ చాంబర్ హాల్ నందు ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈస ందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్ సినిమాలో విద్యార్థి, టీచర్‌కు మధ్య గల సంబంధంతో పాటు, ప్రతి ఒక్కరూ చదువుకుని ఉన్నత విద్యావంతులు కావాలనేది ప్రధాన ఉద్దేశమని విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు ఏవిధంగా కష్టపడతారో మంచి సందేశం ఉందన్నారు. ఈ సందేశాన్ని ప్రతి విద్యార్థికి, అలాగే ఉపాధ్యాయులకు తెలియచేయాలనే ఉద్దేశంతోనే విద్యార్థులు ముగ్గురు కన్నా ఎక్కువ మంది థియేటర్‌కు వస్తే ఒక టికెట్‌పై మరో టికెట్ ఉచితంగా అందిస్తామన్నారు. అలాగే 50 మంది విద్యార్థులు ఏదైనా ఒక విద్యా సంస్థ నుండి వస్తే ఒక టికెట్‌పై

ఇద్దరికి ఉచితంగా సినిమా చూసే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. స్కూల్ మేనేజ్‌మెంట్ ఎవరైనా కోరితే వారి కోసం ప్రత్యేకంగా ఒక షోనూ ఏర్పాటు చేస్తామన్నారు. కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాలోని సార్ సినిమా ప్రదర్శితమవుతున్న అన్ని థియేటర్లలో ఈ రాయితీ పొందవచ్చని తెలిపారు. వివరాలకు 9705 161 908 ఫోన్‌కు సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో సాయిరాం స్క్రీన్స్ అధినేత వినీత్ సాయి, సురేష్ మూవీస్ డిస్ట్రిబ్యూటర్ మేనేజర్ భగవాన్ పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-భవానీపురం: దాతలు ఉదారత్వమే వద్ధాశ్రమాలకి ఊపిరని శ్రీ వెంకట సాయిశ్రీ వద్ధాశ్రమ సేవా సంఘం నిర్వాహకులు వి.నాగరాజీ అన్నారు. ఆదివారం సివిఆర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి దిగువున సిఎన్‌జి బంకు వైపు శివశక్తినగర్‌లోని అస్త్ర అపార్ట్‌మెంట్ నివాసి వేముల సుబ్బారావు తన పుట్టినరోజు సందర్భంగా వద్ధాశ్రమంలోని 25 మంది వృద్ధులకు దుప్పట్లు, యాపిల్ పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు దాతత్వాన్ని కొనియాడారు.

నిధులు మంజూరుకు ప్రతిపాదనలు

ప్రజాశక్తి-విజయవాడ: గిరిజన సంక్షేమ ప్రాజెక్టులు, పథకాలకు చేపడుతున్న ప్రభుత్వేతర సంస్థలు, స్వచ్ఛంద సంస్థలకు 2022-23 సంవత్సరానికి సంబంధించి గ్రాంట్ ఇన్ ఎయిడ్ క్రింద నిధులు మంజూరు చేసేందుకు కొత్త, రెన్యువల్ ప్రతిపాదనలను మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్ కోరడం జరిగిందని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రుక్మాంగదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ...గిరిజనుల అభివద్ధికి చేపడుతున్న విద్యా, వైద్య జీవనోపాధి ప్రాజెక్టులు, పథకాలకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద ఆర్థిక సహాయంగా నిధులు మంజూరు చేసే అవకాశం ఉంటుందన్నారు. ఈ నెల 12వ తేదీలోగా ప్రతిపాదనలను ఆన్ లైన్ వెబ్ సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎన్‌జిఒ.ట్రైబల్.జిఒవి.ఇన్ ద్వారా సమర్పించాలన్నారు. ప్రభుత్వేతర సంస్థలు, స్వచ్ఛత సంస్థల నుండి అందే నూతన, రెన్యువల్ ప్రతిపాదనలకు 2025-26 సంవత్సరం వరకు నూతన మార్గదర్శకాలు అమలులో ఉంటాయన్నారు. ఆన్‌లైన్ చేసిన దరఖాస్తు కాపీల రెండు ప్రతులను పూర్తి ఆధారాలు జతపరిచి జిల్లా గిరిజన సంక్షేమ అధికారి, విద్యుత్ సౌదా ప్రక్కన, విష్ణు నగర్, గుణదల, విజయవాడ, ఎన్టీఆర్ జిల్లా వారి కార్యాలయంలో అందజేయవలసి ఉంటుందని, ఇతర వివరాలకు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించవచ్చునని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రుక్మాంగదయ్య తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.